కోటగిరి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో..
వీక్షించండి చానల్
NS99 CHANNEL
దగా స్థానంలో నిగా వేసే చానల్

దగా స్థానంలో నిఘా వేసే జాతీయ దిన పత్రిక

నీలగిరి శంఖారావం

సమగ్ర సమాచార దర్శిని

తెలుగు జాతీయ దినపత్రిక

నల్లగొండ | సంపుటి :05 | సంచిక :174 | ఎడిటర్ : కోటగిరి చంద్రశేఖర్ | శనివారం 31-10-2026 | పేజీలు : 4 | వెల : రూ. 3/-

నిమ్స్, ఉస్మానియా ఆస్పత్రుల నిర్మాణంపై కీలక అప్‌డేట్!

హైదరాబాద్, తెలంగాణలో ప్రభుత్వ వైద్య సదుపాయాలను మరింత బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం చేపట్టిన కీలక ప్రాజెక్టుల పనులు కొనసాగుతున్నాయి. హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రి విస్తరణతో పాటు, గోషామహల్‌లో నిర్మిస్తున్న కొత్త ఉస్మానియా జనరల్ హాస్పిటల్ భవన నిర్మాణ పనులపై తాజాగా కీలక అప్‌డేట్ వెలువడింది. ఈ రెండు ప్రాజెక్టులను వేగంగా పూర్తి చేయాలని రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అధికారులను ఆదేశించారు.

సెక్రటేరియట్‌లో ఉన్నతస్థాయి సమీక్ష

నిమ్స్ విస్తరణ, ఉస్మానియా ఆస్పత్రి నూతన భవన నిర్మాణ పనుల పురోగతిపై మంత్రి దామోదర రాజనర్సింహ సెక్రటేరియట్‌లో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో సంబంధిత శాఖల ఉన్నతాధికారులు, నిర్మాణ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇప్పటివరకు పూర్తయిన పనులు, తదుపరి చేపట్టాల్సిన నిర్మాణ దశలపై మంత్రి అధికారులతో చర్చించారు. ప్రాజెక్టుల పురోగతికి సంబంధించిన వివరాలను అధికారులు ఆయనకు వివరించారు. నిమ్స్ ఎక్స్‌పాన్షన్ ప్రాజెక్టులో భాగంగా చేపట్టిన భవన నిర్మాణ పనులు ఇప్పటికే 80 శాతం పూర్తయ్యాయని అధికారులు మంత్రికి తెలిపారు. మిగిలిన పనులను కూడా ప్రణాళిక ప్రకారం వేగంగా పూర్తి చేయాలని మంత్రి సూచించారు.

కొత్త ఉస్మానియా ఆస్పత్రి పనులు 23 శాతం పూర్తి

గోషామహల్‌లో నిర్మిస్తున్న ఉస్మానియా జనరల్ హాస్పిటల్ నూతన భవన నిర్మాణ పనులు ఇప్పటివరకు 23 శాతం పూర్తయ్యాయని అధికారులు వెల్లడించారు. ఈ ప్రాజెక్టులో ఎలాంటి జాప్యం జరగకుండా నిర్మాణ పనులను వేగవంతం చేయాలని మంత్రి ఆదేశించారు.

నాణ్యత విషయంలో రాజీ వద్దు



ఈ రెండు ప్రాజెక్టులు రాష్ట్రంలో ప్రభుత్వ వైద్య సేవలను మరింత బలోపేతం చేయడంలో కీలకంగా నిలుస్తాయని మంత్రి దామోదర రాజనర్సింహ పేర్కొన్నారు. ప్రజలకు అత్యాధునిక వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా నిర్మాణ పనులు కొనసాగించాలని సూచించారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని, నిర్దిష్ట ప్రణాళిక ప్రకారం నిర్మాణం ముందుకు సాగాలని స్పష్టం చేశారు. వివిధ శాఖల మధ్య సమన్వయం ఉండాలని, నిర్మాణ సమయంలో ఎదురయ్యే సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ప్రాజెక్టుల పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ, నిర్దేశిత గడువులోగా పనులు పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల నుంచి నగరాల వరకు ప్రజలందరికీ మెరుగైన వైద్య సేవలు అందుబాటులో ఉండేలా వైద్యరంగ మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని తెలిపారు.

పనిలేక తిరుగుతున్నానా?..రేవంత్ సర్కార్‌ను కూల్చేదాకా ఆగను



సికింద్రాబాద్:జవహర్‌నగర్ డంపింగ్ యార్డ్‌ను తరలించాలనే డిమాండ్‌తో బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ చేపట్టిన పాదయాత్ర నాలుగోవ రోజు సాగుతోంది. ఈ క్రమంలో ఆయన రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. కేవలం డంపింగ్ యార్డ్ తరలించేంతవరకే కాదు, కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చే వరకు తన యాత్ర ఆగదని ఆయన హెచ్చరించారు. పనిలేక తిరుగుతున్నానంటూ కాంగ్రెస్ నేతలు చేస్తున్న విమర్శలపై ఈటల ఘాటుగా స్పందించారు. "డంపింగ్ యార్డ్ తొలగింపు కోసం నేను పాదయాత్ర చేస్తుంటే, ఈటల రాజేందర్‌కు పనిలేక తిరుగుతున్నాడని కాంగ్రెస్ నేతలు అంటున్నారు. కేవలం డంపింగ్ యార్డ్ తరలించేదాకా మాత్రమే కాదు.. మీ ప్రభుత్వం కూలిపోయే వరకు నేను తిరుగుతూనే ఉంటా" అని ఆయన స్పష్టం చేశారు. జవహర్‌నగర్ డంపింగ్ యార్డ్ రీసైక్లింగ్ కోసం అయ్యే ఖర్చుపై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే డీటెయిల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్ (డీపీఆర్) సిద్ధం చేయాలని ఈటల డిమాండ్ చేశారు. నివేదిక ఇస్తే, ప్రధానమంత్రి మోదీని ఒప్పించి అవసరమైన నిధులను తానే తీసుకొస్తానని ప్రకటించారు. ఒకవేళ తాను నిధులు తీసుకురావడంలో విఫలమైతే, రాజకీయాల నుంచి శాశ్వతంగా తప్పుకుంటానని సవాల్ విసిరారు. అక్టోబర్ 27న ఏదులాబాద్‌లోని శ్రీరంగనాథ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి ఈటల తన పాదయాత్రను ప్రారంభించారు. డంపింగ్ యార్డ్ కాలుష్యం వల్ల పరిసర గ్రామాలు, కాలనీల్లోని ప్రజల ఆరోగ్యం తీవ్రంగా దెబ్బతింటోందని, గాలి, భూగర్భ జలాలు కలుషితమవుతున్నాయని, తక్షణమే దాన్ని తరలించాలని ఆయన డిమాండ్ చేస్తున్నారు.

మాక్ పార్లమెంటుతో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారు : రామచందర్ రావు



హైదరాబాద్: పార్లమెంటు అనేది ప్రజాస్వామ్య దేవాలయమని గతంలో లోక్‌సభ తొలి మహిళా స్పీకర్ మీరా కుమార్ వ్యాఖ్యానించారని టిబిజెపి అధ్యక్షుడు రామచందర్ రావు గుర్తుచేశారు. గతంలో మాక్ పార్లమెంటు ఎందుకు నిర్వహిస్తున్నారని కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ ప్రశ్నించారని అన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. మాక్ పార్లమెంటు నిర్వహణపై రామచందర్ రావు కాంగ్రెస్ పార్టీపై విమర్శలు గుప్పించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ నేతలు అసత్య ప్రచారాలు చేస్తున్నారని, మాక్ పార్లమెంటు నిర్వహిస్తూ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారని, నేతలు ప్రజలకు వాస్తవాలు చెప్పాలని హితవు పలికారు.మూసీ ప్రాజెక్టుకు బిజెపి వ్యతిరేకం కాదని, అయితే రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక ప్రాధాన్యతలను, ఉద్యోగులకు జీతాలు, పింఛన్లు, పిఆర్సీ అమలు చేయడానికి నిధులు లేవని ప్రభుత్వం చెబుతోందని పేర్కొన్నారు. అదే సమయంలో మూసీ ప్రాజెక్టు కోసం వేల కోట్ల రూపాయలు ఖర్చు చేయడానికి ఎలా సిద్ధమవుతోందని ప్రశ్నించారు. ప్రజా అవసరాలు, ఉద్యోగుల సమస్యలకు ప్రాధాన్యత ఇవ్వకుండా భారీ ప్రాజెక్టులపై ఖర్చు చేయడమేంటని రామచందర్ రావు ప్రభుత్వాన్ని నిలదీశారు. గాంధీ సరోవర్ పేరుతో ఇళ్లు కూల్చివేతను బిజెపి వ్యతిరేకిస్తోందని, నిర్వాసితులకు ముందుగా పునరావాసం కల్పించాకే చర్యలు చేపట్టాలని సూచించారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా నవంబర్ 2న హైదరాబాద్ వస్తున్నారని తెలియజేశారు. బషీర్ బాగ్ బాబుజాగ్జీవన్ విగ్రహం నుంచి మొయింజాహి మార్కెట్ వరకు పాదయాత్ర చేస్తామని, మహాపాదయాత్రలో అమిత్ షా పాల్గొంటారని అన్నారు. మొహింజాహి మార్కెట్ వద్ద సభ నిర్వహిస్తామని, ఎస్ఐఆర్ పై కాంగ్రెస్ తప్పుడు ప్రచారం చేస్తోందని, కాంగ్రెస్ దుష్ప్రచారాన్ని తిప్పికొట్టేలా అమిత్ షా ప్రసంగిస్తారని పేర్కొన్నారు. ఇవిఎంల మీద నమ్మకం లేకపోతే సిఎం రేవంత్ రాజీనామా చేయించండని, ఇండియా కూటమి ర్యాలీ కోసం రైళ్లు ఇవ్వలేదనేది తప్పు అని, దసరా, దీపావళి కోసం ప్రత్యేక రైళ్లు నడుపుతుందని అన్నారు. అడ్వాన్స్ కట్టకుండా ఇప్పటికిప్పుడు అడిగితే రైళ్లు ఎలా సర్దుబాటు చేస్తారని? అని రామచందర్ రావు ప్రశ్నించారు.

లాభాల్లో ఉన్న బ్యాంకును ఎందుకు అమ్ముతున్నారు?: రాహుల్ గాంధీ

ఢిల్లీ: ప్రస్తుతం లాభాల్లో ఉన్న ఐడిబిఐ బ్యాంకును విక్రయించాలని కేంద్ర ప్రభుత్వం ఎందుకు నిర్ణయం తీసుకుందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ప్రశ్నించారు. లాభాల బాట పట్టించడంలో ఉద్యోగుల కృషి ఎంతో ఉందని, ప్రభుత్వ రంగ బ్యాంకులు విక్రయించడానికి ఉన్న ఆస్తులు కావని అన్నారు. ఐడిబిఐ బ్యాంక్ ప్రైవేటీకరణ ప్రతిపాదనపై రాహుల్ గాంధీ స్పందించారు. ఐడిబిఐ ఉద్యోగుల ప్రైవేటీకరణ వ్యతిరేక పోరాటానికి సంపూర్ణ మద్దతు ప్రకటిస్తూ రాహుల్ గాంధీ ఉద్యోగులకు బహిరంగ లేఖ రాశారు. బ్యాంకు ప్రైవేటీకరణతో రోజువారీ సుమారు రూ.10 వేల కోట్ల వ్యాపార లావాదేవీలపై ప్రభావం పడే అవకాశం ఉందని రాహుల్ ఆందోళన వ్యక్తం చేశారు. 2003లో ఐడిబిఐ బ్యాంకులో 50 శాతం వాటాను కొనసాగిస్తామని కేంద్ర ప్రభుత్వం హామీ ఇచ్చిందని రాహుల్ గుర్తుచేశారు. పార్లమెంటుకు ఇచ్చిన హామీని ప్రస్తుత ప్రభుత్వం ఉల్లంఘిస్తోందని ఆరోపించారు. అంతేకాకుండా, ప్రైవేటీకరణ జరిగితే ఎస్సి, ఎస్టి, బిసి వర్గాలకు ప్రస్తుతం ప్రభుత్వ రంగ సంస్థల్లో లభిస్తున్న రిజర్వేషన్లకు విఘాతం కలగవచ్చని సూచించారు. బ్యాంకు ఉద్యోగుల హక్కులు, భవిష్యత్తు పరిరక్షణ కోసం వారి పోరాటానికి కాంగ్రెస్ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఐడిబిఐ ప్రైవేటీకరణ అంశంపై కేంద్ర ప్రభుత్వం తన నిర్ణయాన్ని పునఃపరిశీలించాలని రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు.



రాహుల్ విమర్శలకు నిర్మలా సీతారామన్ కౌంటర్

న్యూఢిల్లీ, ఐడీబీఐ బ్యాంకులో మెజారిటీ వాటా విక్రయించాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయం రాజకీయంగా చర్చనీయాంశంగా మారింది. ఈ నిర్ణయంపై కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ చేసిన విమర్శలకు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్పందించారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వాలు బ్యాంకులపై రాజకీయ ఒత్తిళ్లు తెచ్చి, నిబంధనలకు విరుద్ధంగా రుణాలు ఇప్పించాయని ఆమె ఆరోపించారు. ఆ విధానాల వల్లే ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో భారీగా మొండి బకాయిలు పేరుకుపోయాయని విమర్శించారు.

బ్యాంకులపై రాజకీయ ఒత్తిళ్లు తెచ్చారు: నిర్మల

బ్యాంకులు, ఆర్థిక సంస్థలను కాంగ్రెస్ నేతలు తమ సొంత సంస్థల్లా ఉపయోగించుకున్నారని నిర్మలా సీతారామన్ ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. తమకు అనుకూలమైన సంస్థలకు రుణాలు ఇవ్వాలని బ్యాంకు ఉద్యోగులపై ఒత్తిడి తెచ్చారని ఆరోపించారు. 1976లో ఇందిరా గాంధీ ప్రభుత్వం హయాంలో సంజయ్ గాంధీ వర్గానికి సంబంధమున్న సంస్థకు రుణాల విషయంలో రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గని ఎస్‌బీఐ ఛైర్మన్ ఆర్.కె. తల్వార్‌ను పదవి నుంచి తొలగించారని ఆమె గుర్తుచేశారు. మారుతి సంస్థకు రుణాల విషయంలోనూ సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియాపై సంజయ్ గాంధీ ఒత్తిడి తెచ్చారని ఆరోపించారు.



ఐడీబీఐ బ్యాంకు గతంలో నష్టాల్లో కూరుకుపోయింది

ఐడీబీఐ బ్యాంకు గతంలో తీవ్ర ఆర్థిక సమస్యలను ఎదుర్కొందని ఆర్థిక మంత్రి పేర్కొన్నారు. వీడియోకాన్, విన్‌సమ్, ఏబీజీ షిప్‌యార్డ్, కింగ్‌ఫిషర్ వంటి సంస్థలకు ఇచ్చిన రుణాలు మొండి బకాయిలుగా మారి బ్యాంకుకు భారీ నష్టాలు

కేసీఆర్,ఆయన కుటుంబ సభ్యుల కబ్జాల నుంచి భూములను రక్షించే ప్రయత్నిస్తున్నాం



న్యూఢిల్లీ,మియాపూర్ లో రూ. 50 వేల కోట్ల విలువైన భూముల ప్రభుత్వానికి చెందుతాయని సుప్రీంకోర్టు చారిత్రక తీర్పు ఇచ్చింది. సుప్రీంకోర్టు కు ధన్యవాదాలు తెలియజేస్తున్నా . మియాపూర్ భూములు కొల్లగొట్టేందుకు నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ ఆయన బంధువు దామోదర్ రావు, గోల్డ్ స్టోన్ ప్రసాద్ ద్వారా ప్రయత్నించారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆరోపించారు. శుక్రవారం అయన ఢిల్లీలో మీడియాతో మాట్లాడారు.రేవంత్ మాట్లాడుతూ కేసీఆర్, ఆయన కుటుంబ సభ్యులు, బీఆర్ఎస్ నాయకులు హైదరాబాద్ తో పాటు తెలంగాణలోని విలువైన భూములు కబ్జాకు ప్రయత్నించారు. ఎమ్మెల్యేగా, ఎంపీగా, పీసీసీ అధ్యక్షునిగా ఈ కబ్జా వ్యవహారాలపై పోరాడడంతోనే కక్ష గట్టి నన్ను జైలుకు పంపారు. మియాపూర్ భూముల విషయంలో దామోదర్ రావుకు ముందుగానే విలాసవంతమైన కార్లు లంచంగా ఇచ్చారు. కేసీఆర్ కు నగదు రూపంలో ముడుపులు ఇచ్చారు. మేం ఈ భూముల రక్షణకు ప్రభుత్వనీ తరపున బలమైన వాదనలు వినిపించాం. తీర్పు ప్రభుత్వానికి అనుకూలంగా రావడంతో ఆ భూముల రక్షణకు సరైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించా . కేసీఆర్, ఆయన కుటుంబ సభ్యుల కబ్జాల నుంచి భూములను రక్షించే ప్రయత్నిస్తున్నాం . ఈ విలువైన భూములను విక్రయించి నీటిపారుదల, విద్యా, వైద్య తదితర రంగాలకు కేటాయిస్తాం . ఈ అంశంపై క్యాబినెట్ లో చర్చిస్తామని అన్నారు.మా ప్రభుత్వం వచ్చాక రూ. 1.50 లక్షల కోట్ల విలువైన భూములు రక్షించాం . ఐఎంజీ భూములను భలేరావు కుటుంబ సభ్యులతో కుమ్మక్కై కేటీఆర్ కొట్టేయాలని చూస్తే న్యాయపోరాటంతో అడ్డుకున్నాం . కంచె గచ్చిబౌలి, మామిడిపల్లి భూములను కొట్టేసేందుకు బీఆర్ ఎస్ నాయకులు ప్రయత్నిస్తే న్యాయపోరాటంలో గెలిచాం. గుర్రంగూడ అటవీ భూములను కేటీఆర్ అనుచరులు కబ్జాకు ప్రయత్నిస్తే సుప్రీం కోర్టులో పోరాడాం . ప్రభుత్వం పోరాటంతో ఆది అటవీ భూమి అని సుప్రీం కోర్టు తెల్చి చెప్పింది. మంచిరేవుల లో 143 ఎకరాల భూమిని కేటీఆర్ రాయలసీమ బిల్డర్స్ తో కలిసి కబ్జాకు ప్రయత్నిస్తే దానిని రక్షించాం. అందులో పోలీసుల పిల్లలకోసం స్కూల్ పెట్టాం. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 400 ఎకరాల అటవీ భూమిని బీఆర్ఎస్ లోకి ఫిరాయించిన ఎమ్మెల్యే కు నజరానాగా అప్పగిస్తే సుప్రీం కోర్టులో పోరాడి రక్షించాం. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో బీఆర్ ఎస్ నాయకుల భూ ఆక్రమణలను అడ్డుకున్నాం. మా ప్రభుత్వం వచ్చిన 3 ఏళ్లలో రూ. 1.50 లక్ష కోట్ల విలువైన భూములు రక్షించాం. వనరుల సమీకరణకు నియమించిన మంత్రివర్గం ఉప సంఘం ఈ భూముల విక్రయం.. వచ్చే ఆ నిధులతో చేపట్టే అభివృద్ధి పనులపై అధ్యయనం చేస్తుంది. హరీష్ రావు మామ హనుమంత రావు కబ్జా పెట్టిన భూములు సర్వే చేయకుండా అధికారులను అడ్డుకుంటున్నారు. కోర్టు కు వెళ్లి స్టే తెచ్చుకున్నారు . భూముల ఆక్రమణపై బీఆర్ఎస్ నాయకులు ప్రభుత్వంపై అనేక తప్పుడు ఆరోపణలు చేశారు. శాసనసభ లో చర్చించి చర్యలకు దిగితే తేలు కుట్టిన దొంగల్లా వ్యవహరిస్తున్నారు . మియాపూర్ భూములపై ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పు వస్తే ఎందుకు బీఆర్ఎస్ నాయకులు స్పందించడం లేదు . కనీసం రెవెన్యూ అధికారులను ఎందుకు బీఆర్ఎస్ నాయకులు అభినందించడం లేదని అన్నారు.పద్మాలయ స్టూడియో, ల్యాంకో భూములపై ఉమ్మడి రాష్ట్రంలో కేసులు వేసిన కేసీఆర్, హరీష్ రావు అధికారంలోకి వచ్చిన తర్వాత ఎందుకు వాటిని స్వాధీనం చేసుకోలేదు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఎవరి పై కేసులు వేశారో వారితో కేసీఆర్, హరీశ్ రావు లాలూచీ పడ్డారు . మియాపూర్ భూములపై ఇప్పటికైనా కుట్రలు మానాలి. మియాపూర్ భూముల విక్రయంతో వచ్చే నిధులను విద్యాభివృద్ధికి వినియోగిస్తాం . వాళ్ల భూముల ఆక్రమణలపై చర్చించేందుకు అసెంబ్లీకి రావాలని సీఎం డిమాండ్ చేసారు. రెండు గ్రామాల మధ్య వివాదాన్ని కేసీఆర్ తనకు అనుకూలంగా మలచుకున్నారు . అక్కడి ఆక్రమణలను తేల్చి శ్రీకాంతాచారి అమరవీరుల కాలనీ నిర్మిస్తాం. కేసీఆర్, కేటీఆర్ ఇప్పటికైనా బుద్ధి మార్చుకుని, ఆక్రమణలు చేయడం మానుకోవాలి . వాళ్ల ఆక్రమణలకు వ్యతిరేకంగా కోర్టులు తీర్పులు ఇస్తున్నాయని అన్నారు.

రెండో విడత ఇందిరమ్మ ఇళ్లే మంజూరు పట్టాల పంపిణీ చేసిన మంత్రి పొంగులేటి



ఖమ్మం: రాష్ట్రంలో అర్హులైన ప్రతి పేదవారికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. శుక్రవారం మంత్రి, జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తో కలిసి ఏదులాపురం మునిసిపాలిటీ పరిధిలోని పీవిఆర్ గార్డెన్స్ లో ఏదులాపురం మునిసిపాలిటీ లోని 176 మంది లబ్ధిదారులకు రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ప్రజా ప్రభుత్వం వచ్చిన తర్వాత పేదవారి ఒక స్లాబ్ ఇళ్లలో ఉండాలనే కల, ఆశ ఏదైతే ఉందో అది నెరవేర్చాలనే తపనతో ప్రజా ప్రభుత్వం కృషి చేస్తున్నదని తెలిపారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మొదటి విడతలో 4.5 లక్షల ఇళ్లు, రెండో విడతలో 2.5 లక్షల ఇళ్లు ఇవ్వడం జరిగిందని, హైదరాబాద్ క్యూర్ ప్రాంతంలో మరో లక్ష ఇళ్లు, ఇవన్నీ కలిపి ఈ రెండు విడతల్లో రాష్ట్రవ్యాప్తంగా 8 లక్షల ఇళ్లు 40 వేల కోట్ల రూపాయలతో కట్టే కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం జరిగిందని అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం వంద శాతం పేదోళ్ల మనసును దోచిన, మెచ్చినదని, అర్హులైన ప్రతి పేదవాడికి కులం, మతం, పార్టీ అని చూడకుండా, పూర్తిగా పేదల సంక్షేమమే ధ్యేయంగా అమలు చేయబడుతోందని మంత్రి స్పష్టం చేశారు.



సంపాదకీయం

శనివారం 31-10-2026

యుద్ధ ప్రభావం... హరిత ఇంధనాలే శరణ్యం

పశ్చిమాసియా యుద్ధం అపారమైన ప్రాణనష్టాన్ని కలిగిస్తోంది. మౌలిక సదుపాయాలను ధ్వంసం చేస్తోంది. విపరీతమైన కర్బన కాలుష్యాన్ని సృష్టిస్తోంది. మరోవైపు చమురు, బొగ్గు వంటి శిలాజ ఇంధనాలపై అతిగా ఆధారపడటం వల్ల పర్యావరణానికీ, వాతావరణానికే కాకుండా ఆర్థిక, జాతీయ భద్రతకూ ముప్పు కలుగుతోందని ప్రపంచ దేశాలు గుర్తిస్తున్నాయి. ఇరాన్ యుద్ధం తెచ్చిపెట్టిన ఇంధన సంక్షోభం ప్రత్యామ్నాయ, హరిత ఇంధనాల బాట పట్టేలా పలు దేశాలను పురిగొల్పుతోంది. హర్మూజ్ జలసంధి ద్వారా సాధారణంగా రవాణా అయ్యే చమురు, వంటగ్యాస్‌లలో అధిక భాగం ఆసియాకే వెళ్తుంది. 2026 ఫిబ్రవరి 28 నుంచి ఈ జలసంధిలో ట్యాంకర్ నౌకల రాకపోకలు 90-97 శాతం పడిపోయాయని, వాణిజ్య నౌకల ప్రయాణాలు ఒకానొక దశలో రోజుకు సున్నా నుంచి రెండుకు తగ్గిపోయాయని, పర్షియన్ సింధు శాఖలో దాదాపు 200 ట్యాంకర్లు నిలిచి పోయాయనే వార్తలు వచ్చాయి. ఫిబ్రవరిలో బ్రెంట్ క్రూడ్ పీపా ధర 69-72 డాలర్లు ఉండగా, తర్వాత అది 110-118 డాలర్లకు పెరిగింది. ఆధునిక చమురు మార్కెట్ చరిత్రలోనే ఇది అతిపెద్ద సరఫరా షాక్ అని అంతర్జాతీయ ఇంధన సంస్థ (ఐఈఏ) అభివర్ణించింది. హర్మూజ్‌కు ప్రత్యామ్నాయం అనుకున్న సౌదీ అరేబియా, యూఏఈల ఉమ్మడి పైప్‌లైన్ సామర్థ్యం రోజుకు దాదాపు 70లక్షల పీపాలు మాత్రమే. ఇది సాధారణ హర్మూజ్ రవాణాలో కేవలం మూడోవంతు. 2027 చివరి నాటికి రోజుకు దాదాపు ఆరు లక్షల పీపాల చమురు ఉత్పత్తి శాశ్వతంగా నిలిచిపోయే పరిస్థితి నెలకొని ఉండటం మరింత ఆందోళనకరమైన విషయం. దీనివల్ల ప్రస్తుతం తాత్కాలిక అంతరాయంగా కనిపిస్తున్నది కాస్తా శాశ్వత అడ్డంకిగా మారవచ్చు.

ఐరోపా నుంచి ఆసియా దాకా...

ఇలాంటి పరిస్థితుల్లో పలు దేశాలు చమురు దిగుమతులను తగ్గించుకోవాలని చూస్తున్నాయి. పెరుగుతున్న ఎలక్ట్రిక్ వాహనాల (ఈవీ) వినియోగమే దీనికి నిదర్శనంగా చెప్పవచ్చు. ఈవీలు నిరుడు రోజుకు దాదాపు 17 లక్షల పీపాల చమురు డిమాండ్‌ను తగ్గించాయి, 2030 నాటికి ఇది రోజుకు 50 లక్షల పీపాలకు చేరవచ్చు. ఈ ఏడాదిలో ప్రపంచమంతటా దాదాపు 2.3 కోట్ల ఈవీలు అమ్ముడయ్యే అవకాశం ఉంది. కేవలం ఈవీల వినియోగం ద్వారానే 2035 నాటికి రోజుకు 1.5 కోట్ల పీపాలకు పైగా చమురు అవసరం తగ్గుతుంది. ఇది ప్రస్తుత ప్రపంచ చమురు వినియోగంలో దాదాపు 15 శాతం. చైనా తయారీదారులు నిరుడు ప్రపంచ ఈవీ అమ్మకాలలో దాదాపు అరవై శాతం వాటా నమోదు చేశారు. 2026 మొదటి అర్ధభాగంలో చైనా విద్యుదుత్పత్తిలో పునరుత్పాదక ఇంధనం వాటా 41.2 శాతం. చైనా 2030 నాటికి యాభై శాతం శిలాజేతర విద్యుత్ ఉత్పత్తిని, 2035 నాటికి 3,600 గిగావాట్ల ఉమ్మడి పవన, సౌర విద్యుదుత్పాదనను సాధించాలని లక్షిస్తోంది. ఐరోపా కూడా ఇదే దిశగా పయనిస్తోంది. ఈయూ 2030 నాటికి దాదాపు 600 గిగావాట్ల సౌర విద్యుదుత్పాదన సామర్థ్యాన్ని లక్ష్యంగా పెట్టుకుంది, భవనాల పైకప్పులపై సౌర ఫలకాల ఏర్పాటును తప్పనిసరి చేసింది. 2022-25 మధ్య రష్యా నుంచి గ్యాస్ దిగుమతులు ఈయూ దిగుమతుల్లో దాదాపు 45శాతం నుంచి 12 శాతానికి పడిపోయాయి. అయితే, యూరోపియన్ ఈవీ అమ్మకాలు నిరుడు 30శాతానికి పైగా నమోదయ్యాయి. నార్వేలో కొత్త వాహనాల అమ్మకాల్లో బ్యాటరీ-ఎలక్ట్రిక్ కార్లు అసాధారణంగా 95.9శాతం వాటాను ఆక్రమించాయి. ఆగ్నేయాసియాలోనూ ఈ ఏడాది ప్రారంభంలో ఈవీ అమ్మకాలు కొన్ని అంచనాల ప్రకారం 20 శాతం వాటాకు చేరుకున్నాయి. అల్పాదాయ కుటుంబాలు రెండు, మూడు చక్రాల ఎలక్ట్రిక్ వాహనాలను కొనడం పెరుగుతోంది. భారత్ తన ముడిచమురు అవసరాల్లో 89-90 శాతాన్ని దిగుమతి చేసుకుంటోంది. ఈ ఏడాది మొదటి తొమ్మిది నెలల్లో హర్మూజ్ జలసంధి ద్వారా 41శాతం ముడిచమురు, 55శాతం ఎల్ఎన్‌జీ, 88 శాతం ఎల్పీజీ దిగుమతులు జరిగాయి. యుద్ధ సమయంలో క్రూడ్ దిగుమతులు 22శాతం పడిపోగా, డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ రూ.95.7- 96.5 మేర తగ్గిపోయింది. ప్రభుత్వ చమురు కంపెనీలు రోజుకు దాదాపు రూ.750 కోట్ల నష్టాన్ని చవిచూశాయి. ఇదే సమయంలో, భారతదేశ విద్యుత్ వ్యవస్థ చారిత్రక మార్పునకు లోనవుతోంది. మొన్న జులై నాటికి శిలాజేతర ఇంధన సామర్థ్యం దాదాపు 300.5 గిగావాట్లకు చేరుకుంది. 2030 నాటికి నిర్దేశించుకున్న 500 గిగావాట్ల లక్ష్యంలో ఇప్పటికే 60శాతం కంటే ఎక్కువ సాధించింది. సౌర విద్యుత్ సామర్థ్యం 2014లో కేవలం 2.8 గిగావాట్లు కాగా, ఇప్పుడది దాదాపు 164.6 గిగావాట్లకు విస్తరించింది, పవన విద్యుత్ 58 గిగావాట్లు దాటింది.

కొత్త చోదక శక్తిగా...

బొగ్గు, చమురు, గ్యాస్ రంగాలు ఇప్పటికీ విద్యుత్, రవాణా, పరిశ్రమలకు అవసరమైనవే. పునరుత్పాదక శక్తి వనరుల వినియోగం పెరుగుతోందంటే శిలాజ ఇంధనాలు పూర్తిగా తగ్గిపోతున్నాయని కాదు, దేశాల వ్యూహాత్మక ఆలోచనలు మారుతున్నాయి. సముద్ర మార్గాల్లో చమురు రవాణా ప్రమాదకరంగా, అనిశ్చితిగా తయారవుతోంది. కాబట్టి సౌర ప్యానెళ్లు, టర్బయిన్లు, బ్యాటరీలు, హీట్ పంపులు, ఈవీలు కర్బన ఉద్గారాల తగ్గింపుతోపాటు వ్యూహాత్మక స్వయంప్రతిపత్తిని కూడా అందిస్తాయి. పశ్చిమాసియాలో యుద్ధం ముగిసి తిరిగి శాంతి నెలకొన్నా, మళ్లీ చౌకగా దొరికే చమురును దిగుమతి చేసుకోవడానికి ఎగబడకూడదు. వచ్చే నెలలో జరిగే 'కాప్-31' సభ శిలాజ ఇంధనాలకు ప్రపంచం ఇంకా దూరంగా జరగడానికి చర్యలు తీసుకోవాలి. పునరుత్పాదక ఇంధనం, గ్రిడ్లు, నిల్వ, సామర్థ్యం, విద్యుదీకరణ, శిలాజ ఇంధన దిగుమతుల తగ్గింపునకు అందరూ గట్టిగా కట్టుబడి ఉండేలా తీర్మానించాలి.

ఎక్కడ తగ్గాలో కాంగ్రెస్ గ్రహిస్తేనే..



న్యూఢిల్లీ,మితిమీరిన కోరికలు వ్యక్తం చేస్తే 'ఆశకు హద్దుండాలి, మోహానికి సిగ్గుండాలి' అని మందలిస్తుంటారు. కానీ, కాంగ్రెస్‌ను మందలించేవారెవరు? మందలించకుంటే మరి కాంగ్రెస్ బాగుపడేదెలా? కాంగ్రెస్ బాగుపడకుండా దేశంలో ప్రతిపక్షమైన 'ఇండియా కూటమి' ఎన్నికల్లో మెరుగుపడేదెలా? సమకాలీన రాజకీయాలపై కనీస అవగాహన ఉన్నవారెవరికైనా దేశంలో అతిపెద్ద జనాభా రాష్ట్రం ఉత్తర్‌ప్రదేశ్‌లో ప్రస్తుత రాజకీయాల్ని గమనిస్తే ఈ ప్రశ్నలు తలెత్తక మానవు. ఎందుకంటే, కాంగ్రెస్ అలా ప్రవర్తిస్తోంది. 403 నియోజకవర్గాలున్న యుపి అసెంబ్లీ ఎన్నికల పొత్తుల్లో కాంగ్రెస్ తనకు 200 సీట్లు కావాలంటోంది. పొత్తు కుదురుతుందా? బెడుస్తుందా? అన్నది ఇకపై కాంగ్రెస్ వ్యవహరించే తీరుపైనే ఆధారపడనుంది.కిందటి (2022) ఎన్నికల్లో కాంగ్రెస్ గొంతెమ్మ కోరికలకు సమాజ్‌వాదీ పార్టీ ససేమిరా అంటే, అలిగి, వేర్పడి పోటీ చేసింది. మిగతా 'అమాం బాపతు' పార్టీలను కలుపుకొని 'యుపిఎ' కూటమిగా పోటీ చేసి బొక్కబోర్లా పడింది. 399 స్థానాల్లో పోటీ చేసిన కాంగ్రెస్‌కు రెండంటే రెండే అసెంబ్లీ స్థానాలు దక్కాయి. యుపిలో మా పార్టీకున్న సంస్థాగత బలం, ఇటీవల పెరిగిన మా నాయకుడు రాహుల్ గాంధీ ఇమేజ్ ప్రాతిపదికన మాకు 'గౌరవప్రదమైన' స్థానాలు ఇవ్వాల్సిందే' అని ఎఐసిసి నాయకుడు, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జీ రాజేంద్ర పాల్ గౌతమ్ అంటున్నారు. ఇది ఎస్పి నాయకత్వానికి నచ్చట్లేదు.

వారి ఓటమి అందరికీ నష్టం

ఉత్తరాది రాష్ట్రాల పొత్తుల్లో కాంగ్రెస్ గెలుపు నిష్పత్తి (సక్సెస్ రేట్) తక్కువగా ఉండటం ఇతర భాగస్వామ్య పార్టీల అవకాశాలను దెబ్బతీస్తోంది. పొత్తు చర్చల్లో గీచి గీచి బేరాలు చేసి ఎక్కువ సీట్లు తీసుకోవడం, తక్కువ సీట్లు నెగ్గడం కాంగ్రెస్‌కు రివాజయింది. 2020 బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో 'మహాఘట్ బంధన్' తరపున తేజస్వీ యాదవ్ (ఆర్‌జెడి) ముఖ్యమంత్రి కాకుండా పోవడానికి కాంగ్రెస్ గెలుపు నిష్పత్తి తక్కువగా ఉండటమే కారణమన్నది ఎవరూ కాదనలేని సత్యం. 243 స్థానాల అసెంబ్లీలో 122 మ్యాజిక్ నంబర్. కూటమి 110 స్థానాల వద్ద వచ్చి ఆగింది. పోటీ చేసిన 144లో 75 ఆర్‌జెడి గెలిస్తే 19లో 12 సిపిఐ (ఎంఎల్), 6లో 2 సిపిఐ, 4లో 2 సిపిఎం నెగ్గాయి. కానీ, బెట్టుచేసి 70 స్థానాల్లో పోటీ చేసిన కాంగ్రెస్ 19 చోట్ల మాత్రమే నెగ్గింది. ఇటువంటి అనుభవాలు ఉత్తరప్రదేశ్‌లోనూ తక్కువేమీ లేవు. అందుకే, కాంగ్రెస్‌కు గెలుపు అవకాశాల్నిబట్టి స్థానాలు ఇస్తాం తప్ప వారి కోరినన్ని కాదు అన్నది ఎస్పి నాయకత్వ భావన. 2024 లోక్‌సభ ఎన్నికల్లోనూ, బిజెపిని మానసికంగా ఎంతో కృంగదీసే ఫలితాలు ఇండియా కూటమి సాధించినప్పుడు కూడా కాంగ్రెస్ విజయశాతం తక్కువే! 62 చోట్ల పోటీ చేసిన ఎస్పి 37 చోట్ల (సగానికి పైగా) నెగ్గితే, 17 స్థానాల్లో పోటీ చేసిన కాంగ్రెస్ 6 స్థానాల్లో (దాదాపు మూడో వంతు స్థానాల్లోనే నెగ్గింది. ఎస్పి మెరుగైన ఫలితాలు సాధించడం వల్లే మొత్తానికి కూటమికి ఎన్‌డిఎ పక్షాల పైన ఆధిపత్యం (43/80) దక్కింది. 'ఎక్కువ సీట్లు తీసుకొని బలహీనమైన అభ్యర్థుల్ని కాంగ్రెస్ నిలబెడితే ప్రత్యర్థులకు మేలు జరుగుతుంది. దాని వల్ల కాంగ్రెస్‌కు, ఎస్పికి మాత్రమే కాదు, మొత్తం ఇండియా కూటమికే తీరని నష్టం' అని పార్టీ నాయకులతో ఎస్పి అధినేత అఖిలేశ్ యాదవ్ అన్నట్టు తెలుస్తోంది. అందుకే ఆయన, ఇన్ని సీట్లు కావాలి అనకుండా, ముందు ఎక్కడెక్కడ 'గెలువదగ్గ అభ్యర్థులు'న్నారో జాబితా ఇమ్మని కాంగ్రెస్ వారిని అడుగుతున్నారు. దాన్ని బట్టి కాంగ్రెస్‌కు ఎన్ని స్థానాలు ఇవ్వొచ్చన్నది నిర్ణయించాలని ఎస్పి భావిస్తోంది.

80 కి దిగువనో, పైనో..

'సీట్ల సంఖ్యపై బెట్టు కాదు గానీ, పార్టీకి బలమైన సంస్థాగత నిర్మాణం, గట్టి అభ్యర్థులు ఎక్కడున్నారో చెబుతూ చర్చల ప్రక్రియ ప్రారంభిద్దాం' అని పార్టీ వర్గీయులతో కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక వదేరా అన్నట్టు వార్తలొచ్చాయి. అక్టోబరు 19న ప్రియాంక సమక్షంలో జరిగిన పార్టీ నాయకుల సమావేశంలో రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు ఆరాధన మిశ్రా, ఇటీవలే పార్టీ రాష్ట్ర 'వర్కింగ్ ప్రెసిడెంట్'గా బాధ్యతలు చేపట్టిన ఇమ్రాన్ మసూద్ (శహరాన్‌పూర్ ఎంపి), రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జీ గౌతమ్ తదితరులు పాల్గొన్నారు. చర్చల ప్రక్రియ నిర్మాణాత్మకంగా, సయోధ్య పూరితంగా ఉండాలని ఆమె వారికి సూచించారు. కానీ, బయట అందుకు భిన్నంగా 'సమాన గౌరవం సమాన వాటా' అనే వాదాన్ని ఇమ్రాన్ మసూద్ ఎత్తుకున్నారు. '150 అని ఎవరన్నారు? నా అంచనాల్లో మాకు 200 స్థానాలు ఇవ్వాల్సి ఉంటుంది' అని ఒక మీడియా సమావేశంలో ఇంచార్జీ రాజేంద్రపాల్ గౌతమ్ అనటాన్ని ఎస్పి నాయకులు తప్పుబడుతున్నారు.చర్చల ప్రక్రియ ఓ కొలిక్కి రాకుండానే సీట్ల సంఖ్య, నిర్హేతుకమైన డిమాండ్లను మీడియాలో చెప్పుకోవడం సరికాదన్నది వారి వాదన.అంతకు ముందు, అక్టోబర్ 13న రాహుల్ గాంధీ వద్ద జరిగిన 'చాయ్ భేటీ'లో ఎస్పి సీనియర్ ఎం.పి రాజీవ్‌రాయ్ ఒక మాట ప్రియాంకకు చెప్పారు. 'ఇన్ని నియోజకవర్గాలు అనే లెక్క -జాబితా కాదు గానీ, గెలుపు అవకాశాలు గల అభ్యర్థులు కాంగ్రెస్‌కు ఎక్కడెక్కడ ఉన్నారు, వారి పేర్లతో జాబితా ఇవ్వండి' అని పేర్కొన్నారు. ఇది కాంగ్రెస్ పార్టీలో వేడి పుట్టించింది. 'అలా ఎవరైనా ముందే జాబితా ఇస్తారా? దేశంలో ఎక్కడా జరుగదు. ముందు నియోజకవర్గాలు తేలాలి' అన్నది కాంగ్రెస్ ఆలోచనగా ఉంది. లోగడ ఒక ఎన్నికలో కూటమి తరపున తాను స్వయంగా ప్రచార బరిలో దిగుతానని ప్రియాంక గాంధీ మాటిస్తే, వంద స్థానాలు కాంగ్రెస్‌కు ఇచ్చి భంగపోయిన అనుభవం ఎస్పిది. సీట్లు కేటాయించిన తర్వాత ఎన్నిమార్లు ఫోన్ చేసినా సదరు నాయకురాలు స్పందించనే లేదని ఎస్పి సమావేశాల్లో అఖిలేశ్ యాదవ్ స్వయంగా వెల్లడించారు. 2022 ఎన్నికల్లో 'మై లడికీ హూ, లడ్ సక్తీ హూ' అని ప్రియాంక ప్రచారం చేసినా ఫలితాలు మాత్రం (2/399) ఘోరంగా వెక్కిరించాయన్నది ఎస్పి వర్గాల ఆవేదన. అందుకే, కాంగ్రెస్‌కు ఇచ్చేవి 60- 80 స్థానాల మధ్య ఎక్కడో గిరి గీయాలన్నది వారి ఆలోచన. బెట్టు చేసి, బేరమాడి 80 -100 మధ్య ఏదో సంఖ్యను ఖరారు చేసుకోవాలని కాంగ్రెస్ తాపత్రయం.

ఉమ్మడి లక్ష్యమే వారిని కట్టివుంచాలి

ఎటు తిరిగి ఈ ఎన్నికల్లో బిజెపిని ఓడించాలనే ఉమ్మడి లక్ష్యమే ఎస్పి, కాంగ్రెస్‌ను కట్టిపడేసేది. యుపిలో కూట మి పెద్దన్నగా ఎస్ఫి అధినేతకు 'పెద్దమనసుండాల'ని కాంగ్రెస్ వాదులు చెబుతున్నా 'ఇండియా కూటమి' దీర్ఘకాలిక ప్రయోజనాల దృష్ట్యా కాంగ్రెస్ పార్టీయే 'ఇచ్చిపుచ్చుకునే ధోరణి'తో ఉండాలని ఎస్పి వర్గాలంటున్నాయి. పొత్తుల్లో తమకు కేటాయించమని కాంగ్రెస్ వారు ప్రతిపాదించే 180 స్థానాల జాబితాలో, 12 ఎస్పి సిట్టింగ్ ఎంఎల్ఎ స్థానాలుండటాన్ని వారు ఎత్తిచూపుతున్నారు. ఇదేనా పొత్తు పద్ధతి? అని ప్రశ్నిస్తున్నారు. కాంగ్రెస్‌తో పొత్తు లేకుండానే కిందటి అసెంబ్లీ ఎన్నికల్లో ఎస్పి 36 శాతం ఓటు వాటాతో 111 స్థానాలు సొంతంగా నెగ్గింది. 55 స్థానాల్లో బిజెపి 5వేల లోపు ఓట్ల వ్యత్యాసంతో గెలిచింది. 5వేల వరకు వ్యత్యాసపు సీట్లు 23, 3వేల లోపువి 3, 2వేల లోపువి 11, వెయ్యిలోపువి 11, 500లోపు ఓట్ల వ్యత్యాసంతో గెలిచిన స్థానాలు 7, ఇలా మొత్తం 55 ఉన్నాయి. ఈ గణాంకాలు, ప్రస్తుత రాజకీయ పరిణామాలు, గత పదమూడేళ్లలో ఇప్పుడే బిజెపికి ఎదురవుతున్న అత్యధిక వ్యతిరేకత... వీటన్నిటిని సానుకూలంగా మలచుకోవడానికి ముందు కావాల్సింది యుపిలో ఎస్పికాంగ్రెస్ మధ్య సయోధ్య!

ట్రాన్స్‌ఫార్మర్ల చోర ముఠా అరెస్ట్

నల్గొండ :తెలుగు రాష్ట్రాల్లో రైతుల విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను లక్ష్యంగా చేసుకుని 29 చోరీలకు పాల్పడిన అంతర్రాష్ట్ర ముఠాకు చెందిన నలుగురిని సిసిఎస్ పోలీసులు అరెస్టు చేశారు. మిర్యాలగూడ వేములపల్లి వద్ద వాహన తనిఖీల్లో పట్టుబడిన నిందితుల నుంచి రూ.30 లక్షల విలువైన రెండు కార్లు, రూ.20 లక్షల నగదు, కాపర్ వైర్, కట్టర్లను స్వాధీనం చేసుకున్నారు.నిందితులు 29 కేసులలో వున్నారని పోలీసులు గుర్తించారు.

అధ్యాపక పోస్టుల భర్తీ ఇలాగేనా?



హైదరాబాద్,తెలంగాణ రాష్ట్రంలోని పన్నెండు ప్రభుత్వ విశ్వవిద్యాలయాల్లో దీర్ఘ కా లంగా ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టుల భర్తీకి ప్రభుత్వం తాజాగా చర్యలు ప్రారంభించింది. రాష్ట్రంలోని పన్నెండు విశ్వవిద్యాలయాల్లో సహాయ ఆచా ర్యుల పోస్టులు 1,601 ఖాళీగా ఉన్నట్లు తాజా నివేదికలు వెల్లడిస్తున్నాయి. అయితే ప్రభుత్వం తొలి దశలో ఇటీవల జీవో నెంబర్ 142 ద్వారా ప్రత్యక్ష నియామకానికి అనుమతించినవి 429 పోస్టులు మాత్రమే.

నియామకానికి అనుమతి మాత్రం 429కే..

అంటే మొత్తం ఖాళీల్లో సుమారు 26.8 శాతం పోస్టుల భర్తీకే ప్రస్తుతం అనుమతి లభించింది. మిగిలిన సుమారు 1,172 ఖాళీల భర్తీపై తక్షణ స్పష్టత లేదు. మరోవైపు ప్రొఫెసర్లు, సహాచార్యులు, సహాయ ఆచార్యులు కలిపి పన్నెండు విశ్వవిద్యాలయాల్లో మొత్తం 2,125 బోధనా పోస్టులు ఖాళీగా ఉన్నట్లు నివేదికలు చెబుతున్నాయి. ఇది కేవలం నియామకాల సంఖ్యకు సంబంధించిన అంశం మాత్రమే కాదు.. రాష్ట్రంలోని ప్రభుత్వ విశ్వవిద్యాలయాల్లో బోధన, పరిశోధన, విద్యా ప్రమాణాల పరిస్థితికి సంబంధించిన ప్రశ్నగా చూడాల్సిన అవసరం ఉంది.

పారదర్శకమైన కారణం ఉందా?

ముఖ్యంగా 1,601 ఖాళీలలో 429 పోస్టులకే అనుమతి ఇవ్వడానికి అనుసరించిన ప్రమాణాలు ఏమిటి? ప్రతి విశ్వవిద్యాలయంలోని శాఖల వారీగా ఖాళీలు, మంజూరైన పోస్టులు, పనిచేస్తున్న రెగ్యులర్ అధ్యా పకులు, ఒప్పంద అధ్యాపకులు, విద్యార్థుల సంఖ్య, బోధనా అవసరాల ఆధారంగా ఈ సంఖ్యలను ఎలా నిర్ణయించారు? అన్న వివరాలను ప్రభుత్వం బహిర్గతం చేయాల్సిన అవసరం ఉంది. ఎందుకంటే ఖాళీ పోస్టు, ప్రత్యక్ష నియామకానికి ప్రభుత్వం అనుమతించిన పోస్టు రెండూ ఒకటే కాకపోయినా, ఆ రెండింటి మధ్య ఉన్న వ్యత్యాసానికి పారదర్శకమైన పరిపాలనా కారణం ఉండాలి.

ప్రభుత్వ అధికార పరిధి ఏ మేరకు?

ముఖ్యంగా విద్యా, పరిశోధనా పనితీరుకు కేటాయించే మార్కుల విధా నాన్ని మార్చే అధికారం ప్రభుత్వానికి ఎంతవరకు ఉంది? యూజీసీ పట్టికలో ఉన్న మార్కులను సగానికి తగ్గించడం కేవలం సమానాను పాతంలో పునర్విభజనగా పరిగణించాలా? లేక ఎంపికలో విద్యా, పరిశోధనా ప్రతిభకు ఉన్న ప్రాధాన్యతను మార్చినట్లుగా పరిగణిం చాలా? పది మందిలో ఒకరిని ఎంపిక చేసే వడపోత విధానానికి చట్ట బద్ధమైన ఆధారం ఏమిటి? ఆ వడపోతను నిర్వహించే రాష్ట్ర ఉన్నత విద్యామండలికి ఎంతవరకు అధికార పరిధి ఉంది? వడపోత కమిటీలో రాష్ట్ర ఉన్నత విద్యామండలి ప్రతినిధి పాత్ర కేవలం అర్హతలు, ధ్రువపత్రాల పరిశీలనకే పరిమితమా? లేక అభ్యర్థుల మెరిట్ నిర్ణయించే స్థాయిలోఉంటుందా స్క్రూటినీలో వున్న 100 మార్కులను 50గా మర్చి ఇంట ర్వ్యూలో వెయిటేజీ ఇవ్వడం యూజీసీ నిబంధనలను అతిక్రమించడం అవుతుందా? ఆయా వర్సిటీలలో గతంలో జరిగిన నియమకాలపై ప్రస్తుతం హైకోర్టులో కేసుల పెండింగ్.. అన్న ప్రశ్నలకు స్పష్టమైన సమాధానాలు అవసరం.

ఇంటర్వ్యూలో వెయిటేజీ ఎలా...?

ఈ నేపథ్యంలో ప్రభుత్వంకి మూడు అంశాలపై స్పష్టత ఇవ్వాల్సిన బాధ్యత ఉంది. మొదటిది- వాస్తవ ఖాళీలు ఎన్ని, నియామకానికి అనుమ తించినవి ఎన్ని, మిగిలిన పోస్టులను ఎందుకు నిలిపివేశారు రెండవది- విద్యా పరిశోధనా మార్కుల విషయంలో యూజీసీ నిబంధనలు, రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మధ్య ఏకరూపత ఎలా సాధించబడింది మూడవది- వడపోత, పది మందిలో ఒకరి ఎంపిక, రాష్ట్ర ఉన్నత విద్యామండలి పాత్ర, తుది ఎంపిక సంఘం అధికారాల మధ్య చట్టబద్ధమైన సంబంధం ఏమిటి స్క్రూటినీ మార్కులను ఇంటర్వ్యూలో వెయిటేజీకి కేటాయించడం.. ఈ ప్రశ్నలకు సమాధానాలు లభిస్తేనే నియామక ప్రక్రియపై అభ్యర్థుల్లో విశ్వాసం పెరుగుతుంది.

ప్రమాదంలో అభ్యర్థుల భవిష్యత్తు!

అయితే నియామకాలు త్వరగా జరగడం ఎంత ముఖ్యమో, అవి యూజీసీ నిబంధనలు, రాష్ట్ర విశ్వవిద్యాలయ చట్టాలు, గత ప్రభుత్వ ఉత్తర్వులు, తాజా మార్గదర్శకాలు పరస్పరం విరుద్ధంగా కాకుండా, పారదర్శకంగా, సమాన అవకాశాలతో, న్యాయపరమైన పరిశీలనలోనూ నిలబడే విధంగా జరగడం అంతకంటే ముఖ్యమైనది. లేకపోతే వేలాది మంది అభ్యర్థుల భవిష్యత్తును ప్రభావి తం చేసే ఈ నియామక ప్రక్రియ మరోసారి నిబంధనల వివాదం, న్యాయపరమైన సవాళ్లు, నియామకాల ఆలస్యానికి కారణమయ్యే ప్రమాదం ఉంది.

వైనాట్ పులివెందుల..

విశాఖపట్టణం, రాజకీయాల్లో గెలుపు ఆశలు ఉండొచ్చు. కానీ అవి రెక్కలు విప్పుకుని మరీ ప్రజాస్వామ్య సూత్రాలను దాటి వెళ్ళిపోరాదు, అధికార దుర్వినియోగంగా మారరాదు. అంతే కాదు ప్రజల ఆకాంక్షలను దాటి భిన్నంగా ఆలోచించరాదు. ఇది రాజుల కాలం కాదు కోటలను జయించుకోవడానికి, ఇది ప్రజాస్వామ్యం. జస్ట్ అయిదేళ్ళు మాత్రమే అక్కడ అధికారం ఉంటుంది. మళ్ళీ ఎన్నికలు జరిగితే తీర్పు మారుతుంది. అయినా సరే ప్రజాస్వామ్యంలో రాచరిక పోకడలతో వై నాట్ అంటున్నారు రాజకీయ అధినేతలు. అందుకే నాడు కుప్పం జగన్ టార్గెట్ అయితే నేడు పులివెందుల చంద్రబాబు టార్గెట్ అయింది. నిజానికి రాజకీయ పార్టీలు మఠాలు కావు, మడి కట్టుకుని కూర్చోవడానికి. అవి రాజకీయ ప్రాబల్యం కోసం ప్రయత్నం చేస్తాయి, చేయాలి కూడా. అది తప్పు కానే కాదు, జగన్ కుప్పం గెలవాలనుకున్నా చంద్రబాబు పులివెందుల గెలిచి తీరాలనుకున్నా లక్ష్యాలలో విభేదించేవారు లేరు, కానీ అక్కడ పార్టీలు అమలు చేస్తున్న విధానాలనే అంతా తప్పు పడుతున్నారు. అధికారాన్ని తమ చేతుల్లోకి తీసుకుని ప్రత్యర్థి పార్టీ క్యాడర్ ని వేధించి చివరికి గెలిచామని చెప్పుకోవడం వెనక సంతోషం కానీ సంబరం కానీ ఉండదు, అది ఆత్మ సంతృప్తి కోసం మాత్రమే. జగన్ కి కుప్పంలో 2021లో కలిగిన తాత్కాలిక ఆనందం కాస్త 2024 నాటికి పూర్తిగా కరిగిపోయింది. ఎందుకంటే చంద్రబాబు కంచుకోట కుప్పాన్ని గెలిచామని జగన్ సంతోషపడినంత సేపు లేదు, ఏపీ మొత్తాన్ని టీడీపీ కూటమి కబలించి వైసీపీని అధికారంలో నుంచి దించేయడానికి పట్టిన సమయం. మరి నాడు తప్పు అని ఘోషించిన టీడీపీ వర్గాలు ఇపుడు పులివెందుల విషయంలో ఎలా ఒప్పు అనగలవని కూడా ప్రశ్నిస్తారు, అలాగే నాడు ఒప్పు అని కుప్పం కోట మీదకు రాజకీయ దండయాత్ర చేసిన వైసీపీకి ఈ రోజు పులివెందులలో టీడీపీ దండయాత్ర తప్పు ఎలా అనిపించిందో కూడా ఆలోచించాల్సిందే.నిజానికి కుప్పం అంటే చంద్రబాబు కంచుకోట అని భావిస్తారు. ఆయన 1989 నుంచి అక్కడ నుంచే గెలుస్తూ వస్తున్నారు. అందువల్ల కుప్పంలో స్థానిక ఎన్నికల్లో టీడీపీని ఓడిస్తే బాబు కోటకు బీటలు వారాయని చెప్పవచ్చు అనుకుంది వైసీపీ. కానీ అలా జరగలేదు కదా, 2024లో మళ్ళీ చంద్రబాబు అక్కడ నుంచి గెలిచారు. అంతే కాదు రాష్ట్రవ్యాప్తంగా టీడీపీ కూడా గెలిచింది. ఇపుడు పులివెందుల మీద చంద్రబాబు టార్గెట్ చేశారు. పులివెందుల అంటే 1978 నుంచి వైఎస్సార్ కుటుంబానికి కంచుకోట, వైఎస్సార్ నుంచి జగన్ దాకా వరసగా గెలుస్తూ వస్తున్నారు. అందువల్ల ఆ కోటను కొడితే జగన్ రాజకీయంగా సరి అన్నది టీడీపీ ఫిలాసఫీ. మరి కుప్పంలో టీడీపీని ఓడిస్తే 2024లో బాబు ఓడలేదు కదా మరి ఈ థియరీ కళ్ళ ముందు ఉంచుకుని మరీ ఈ రోజున పులివెందులలో అన్నీ గెలిచేశామని టీడీపీ సంబరపడడాన్ని ఎలా అర్థం చేసుకోవాలి అన్నది ఒక చర్చ.

పోలవరం ప్రాజెక్టులో మరో కీలక మైలురాయి..

ఏలూరు, ఏపీ జీవనాడి పోలవరం ప్రాజెక్టు నిర్మాణం శరవేగంగా సాగుతుంది. తాజాగా పోలవరం ప్రాజెక్టు మరో ప్రధాన మైలురాయిని చేరుకుంది. సెప్టెంబర్ నాటికి ఈ ప్రాజెక్టు మొత్తం నిర్మాణంలో 90.1 శాతం ఫిజికల్ ప్రోగ్రెస్ సాధించగా, మొదటి విడత కింద 78 శాతం పనులు పూర్తైనట్లు అధికారులు తెలిపారు. కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని నీటి వనరుల శాఖ కార్యదర్శి అధ్యక్షతన అక్టోబర్ 12న జరిగిన ఉన్నత స్థాయి సమావేశంలో సమర్పించిన నివేదిక ప్రకారం ప్రాజెక్టుకు సంబంధించిన హెడ్‌వర్క్స్, ప్రధాన కాలువల పనులు తుది దశకు చేరుకున్నాయి. స్పిల్‌వే, గ్యాప్-3లో మెయిన్ డ్యామ్, గ్యాప్-1, 2లలో డయాఫ్రమ్ వాల్స్, అప్‌స్ట్రీమ్, డౌన్‌స్ట్రీమ్ కాఫర్ డ్యామ్‌లు, అప్‌స్ట్రీమ్ కాఫర్ డ్యామ్ బట్రెస్, కుడి కాలువ పనులు వంద శాతం పూర్తయ్యాయి. సివిల్ పనుల్లో 88 శాతం ఆర్థిక పురోగతి, భూసేకరణలో 95.6 శాతం పూర్తైందని నివేదిక తెలిపింది. అయితే, నిర్వాసితుల పునరావాసం, పునర్నిర్మాణం పనులు ప్రస్తుతం 51.9 శాతం వద్ద ఉండటంతో, ప్రాజెక్టును సకాలంలో పూర్తి చేయడానికి అధికారులు దీనిపై దృష్టి సారించారు. ఆగస్టు 28, 2024న కేంద్ర క్యాబినెట్ ఫేజ్-1 వ్యయం రూ. 30,436.95 కోట్లకు సవరించి ఆమోదం తెలిపింది. అనంతరం కేంద్ర ప్రభుత్వం నుండి ప్రాజెక్టుకు నిరంతర

ఇజ్రాయెల్ ఎన్నికలను అరబ్బులు దొంగిలించారు

ఢిల్లీ,: ఇజ్రాయెల్ సార్వత్రిక ఎన్నికల ఫలితాలు తీవ్ర ఉత్కంఠకు దారితీశాయి. ఏ కూటమికి ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన స్పష్టమైన మెజారిటీ లభించకపోవడంతో రాజకీయ అనిశ్చితి నెలకొంది. ఈ నేపథ్యంలో ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహుకు చెందిన లికుడ్ పార్టీ సంచలన ఆరోపణలు చేసింది. అరబ్ నేతృత్వంలోని పార్టీలు లంచాలు, బెదిరింపులు, హింసకు పాల్పడి ఎన్నికలను దొంగిలించాయని తీవ్రంగా విమర్శించింది. బుధవారం నాటికి దాదాపు 90 శాతం ఓట్లు లెక్కించగా, 120 స్థానాలున్న ఇజ్రాయెల్ పార్లమెంట్ 'నెస్సెట్'లో నెతన్యాహు నేతృత్వంలోని మితవాద కూటమి 53 సీట్లకు పరిమితమైనట్లు తెలుస్తోంది. మాజీ సైన్యాధిపతి గాడి ఐసెన్‌కోట్ నేతృత్వంలోని విపక్ష కూటమి 48 స్థానాల్లో నిలిచింది. ప్రభుత్వ ఏర్పాటుకు 61 సీట్ల మ్యాజిక్ ఫిగర్ అవసరం కాగా, రెండు కూటములూ ఆ మార్కును అందుకోలేకపోయాయి.కింగ్‌మేకర్‌గా అరబ్ పార్టీలు: ఈ ఎన్నికల్లో అరబ్ నేతృత్వంలోని జాయింట్ లిస్ట్, రామ్ పార్టీలు చారిత్రక విజయాన్ని నమోదు చేశాయి. గతంతో పోలిస్తే దాదాపు రెట్టింపు స్థానాలు సాధించి, ఏకంగా 19 సీట్లను కైవసం చేసుకున్నాయి. దీంతో ప్రభుత్వ ఏర్పాటులో ఈ పార్టీలు కింగ్‌మేకర్‌గా అవతరించాయి. ఈ పరిణామంతోనే నెతన్యాహు వర్గం తీవ్ర ఆందోళనతో ఆరోపణలకు దిగింది. ఓటింగ్ శాతం కూడా గత 25 ఏళ్లలో ఎన్నడూ లేనంతగా 77 శాతానికి చేరడం గమనార్హం. "ఉగ్రవాదానికి, యూదు దేశ వినాశనానికి మద్దతిచ్చే అరబ్ పార్టీలు ఈ ఎన్నికలను దొంగిలించాయి" అని లికుడ్ పార్టీ ఒక ప్రకటనలో పేర్కొంది. ఓటర్లను ప్రలోభపెట్టడం, పోలింగ్ అధికారులను బెదిరించడం, నకిలీ ఓట్లు వేయడం వంటి అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించింది. దీనికి సంబంధించి వందలాది సాక్ష్యాలు, ఆధారాలను పోలీసులకు, సెంట్రల్ ఎలక్షన్స్ కమిటీకి సమర్పించినట్లు వెల్లడించింది. ఇప్పటికే రామ్ పార్టీకి ఓట్లు కొనుగోలు చేసేందుకు ప్రయత్నించారన్న ఆరోపణలపై ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు పోలీసులు ధ్రువీకరించారు. వారి నుంచి నగదు, కవర్లు స్వాధీనం చేసుకున్నారు. అయితే, ఇది ఒకటీ అరా చోట్ల జరిగిన అసాధారణ ఘటన అని, దీనిపై విచారణ జరుగుతోందని ఎన్నికల కమిటీ తెలిపింది. పూర్తిస్థాయి అక్రమాల ఆరోపణలను కూడా సమీక్షిస్తున్నట్లు వెల్లడించింది. ప్రస్తుతానికి ఇరు కూటముల నేతలూ ప్రభుత్వ ఏర్పాటుకు ప్రయత్నిస్తామని చెబుతున్నారు. మరోసారి ఎన్నికలకు వెళ్లకుండా సంప్రదింపుల ద్వారా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని అధ్యక్షుడు ఐజాక్ హెర్జోగ్ పార్టీలకు పిలుపునిచ్చారు. తుది ఫలితాలు వెలువడి, కొత్త ప్రభుత్వం ఏర్పడే వరకు నెతన్యాహు ఆపద్ధర్మ ప్రధానిగా కొనసాగుతారు.

వడ్డీరేట్లను యథాతథంగా ఉంచిన అమెరికా కేంద్ర బ్యాంక్..!

వాషింగ్టన్: అగ్రరాజ్యం అమెరికా లో ద్రవ్యోల్బణం ఆందోళనకరస్థాయిలో కొనసాగుతున్నప్పటికీ.. ఆ దేశ కేంద్ర బ్యాంక్ అయిన ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను యథాతథంగా ఉంచింది. అమెరికా మధ్యంతర ఎన్నికల ముందు ఈ మేరకు కీలక నిర్ణయం తీసుకుంది. రెండు రోజులపాటు జరిగిన పాలసీ సమావేశం అనంతరం.. వడ్డీ రేట్లను 3.75% నుంచి 4.00% శ్రేణిలోనే కొనసాగిస్తున్నట్లు ప్రకటించింది. భవిష్యత్తులో అనుసరించాల్సిన విధానాలపై స్పష్టత కోసం ఇంకొంత సమాచారాన్ని విశ్లేషించాల్సి ఉందని, అందుకే ఈసారి పెంపునకు విరామం ఇస్తున్నామని తెలిపింది. ద్రవ్యోల్బణం ఇంకా అధిక స్థాయిలోనే ఉందని ఫెడ్ తన ప్రకటనలో పేర్కొన్నది. వడ్డీ రేట్ల పెంపును నిలిపివేయడంవల్ల మరిన్ని వివరాలను సేకరించి విశ్లేషించేందుకు అవకాశం లభిస్తుందని తెలిపింది. ద్రవ్యోల్బణాన్ని తిరిగి రెండు శాతం లక్ష్యానికి సకాలంలో చేర్చేందుకు ఎలాంటి విధానాలు అవసరమో నిర్ధారించడానికి ఈ సమాచారం ఉపయోగపడుతుందని పేర్కొన్నది. అమెరికాలో ద్రవ్యోల్బణాన్ని నియంత్రించేందుకు వడ్డీరేట్లను పెంచడం లేదా తగ్గించడం వంటి నిర్ణయాలను ఫెడ్ తీసుకుంటుంది. వడ్డీరేట్ల పెంపు ద్వారా రుణాలను, ఖర్చులను తగ్గించి ధరల పెరుగుదలకు అడ్డుకట్ట వేస్తుంది. గత నెలలోనే ఫెడ్ చైర్మన్ కెవిన్ వార్ష్ నేతృత్వంలోని కమిటీ.. మూడేళ్లలో తొలిసారిగా వడ్డీ రేట్లను పెంచింది. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రేట్లను తగ్గించాలని డిమాండ్ చేసినప్పటికీ ద్రవ్యోల్బణాన్ని కట్టడిచేసే లక్ష్యంతో ఫెడ్ ఈ నిర్ణయం తీసుకుంది. సెప్టెంబర్ నెలలో అమెరికాలో వినియోగదారుల ధరలు గత ఏడాదితో పోలిస్తే 3.7% పెరిగాయి. ఇరాన్ యుద్ధానికి ముందు ఫిబ్రవరిలో ఇది కేవలం 2.4% గానే ఉంది. యూఎస్ ఫెడ్ వడ్డీ రేట్లను యథాతథంగా ఉంచినప్పటికీ ఇది ప్రపంచ ఈక్విటీ మార్కెట్లకు సానుకూల సంకేతం కాదని నిపుణులు విశ్లేషిస్తున్నారు. కర్మ క్యాపిటల్ పోర్ట్‌ఫోలియో మేనేజర్ థామస్ ప్రిజు మాట్లాడుతూ.. ఫెడ్ రేట్లను మార్చకపోవడం సానుకూలంగా కనిపించినా, ఇది తాత్కాలిక విరామం మాత్రమే కావచ్చునని అభిప్రాయపడ్డారు. ఫెడ్ పాలసీ కమిటీలో జరిగిన ఓటింగ్‌లో 10-2 తేడాతో ఈ నిర్ణయం తీసుకున్నారని, ఇద్దరు సభ్యులు 25 బేసిస్ పాయింట్ల పెంపునకు మొగ్గు చూపారని తెలిపారు. ద్రవ్యోల్బణం ఎక్కువగా ఉన్న నేపథ్యంలో కమిటీలో భిన్నాభిప్రాయాలు ఉన్నాయని ఇది స్పష్టం చేస్తోందని పేర్కొన్నారు. భారత ఈక్విటీ మార్కెట్లపై దీని ప్రభావం గణనీయంగా ఉండవచ్చని ఆయన అంచనా వేశారు. భవిష్యత్తులో అమెరికా వడ్డీ రేట్లను పెంచితే యూఎస్ బాండ్ ఈల్డ్స్, డాలర్ విలువ మరింత పెరుగుతాయని థామస్ ప్రిజు తెలిపారు. దీనివల్ల భారత్ వంటి వర్ధమాన దేశాల మార్కెట్లలోకి వచ్చే విదేశీ పెట్టుబడుల ప్రవాహంపై ఒత్తిడి పెరుగుతుందని, ఫలితంగా నిఫ్టీలో ఒడిదొడుకులు తీవ్రమవుతాయని అన్నారు. ముఖ్యంగా అధిక వ్యాల్యుయేషన్ ఉన్న స్టాక్స్, విదేశీ పోర్ట్‌ఫోలియో పెట్టుబడులపై ఎక్కువగా ఆధారపడిన రంగాల షేర్లు ప్రపంచ ద్రవ్యలభ్యత పరిస్థితుల్లో మార్పులకు సున్నితంగా ప్రభావితమయ్యే ప్రమాదం ఉందని థామస్ ప్రిజు హెచ్చరించారు.

ట్యాంక్‌బండ్‌పై బీజేపీ మహా పాదయాత్ర లేదా?

హైదరాబాద్:హైదరాబాద్‌లో నవంబర్ 2న నిర్వహించనున్న బీజేపీ మహా పాదయాత్రకు సంబంధించి పార్టీ కీలక మార్పుల దిశగా ఆలోచిస్తోంది. తొలుత ట్యాంక్‌బండ్ నుంచి పాదయాత్ర చేపట్టాలని భావించినప్పటికీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా హాజరవుతుండటంతో రూట్‌ను మార్చే యోచనలో ఉన్నట్లు సమాచారం. భద్రతా ఏర్పాట్లు, పరిపాలనాపరమైన అంశాలతో పాటు భారీగా కార్యకర్తలు తరలివచ్చే అవకాశం ఉండటంతో ప్రత్యామ్నాయ ప్రాంతాలను పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. అమిత్ షా పాల్గొనే ఈ కార్యక్రమానికి భారీగా జనసమీకరణ చేయాలని బీజేపీ భావిస్తోంది. పాదయాత్రతో పాటు చివర్లో భారీ బహిరంగ సభ నిర్వహించే ఆలోచనలోనూ ఉంది. ఈ నేపథ్యంలో సభకు అనువైన ప్రాంతంగా నాంపల్లిలోని ఎగ్జిబిషన్ గ్రౌండ్‌ను పార్టీ ముఖ్య నేతలు పరిశీలించినట్లు సమాచారం. ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియపై కాంగ్రెస్, ఇండియా కూటమి చేస్తున్న విమర్శలను తిప్పికొట్టడమే లక్ష్యంగా బీజేపీ ఈ మహా పాదయాత్రను నిర్వహించనుంది. ఓటర్ల జాబితాల సవరణపై ప్రజల్లో అవగాహన కల్పించడంతో పాటు, విపక్షాల ఆరోపణలకు సమాధానం చెప్పాలని పార్టీ భావిస్తోంది.

క్యాన్సర్ మందుల ధరల్లో మార్పుల్లేవు..



న్యూఢిల్లీ,క్యాన్సర్ చికిత్స పొందుతున్న రోగులకు ఔషధాల ధరల విషయంలో తక్షణ ఉపశమనం లభించలేదు. నేషనల్ ఫార్మాస్యూటికల్ ప్రైసింగ్ అథారిటీ (ఎన్‌పీపీఏ) విడుదల చేసిన తాజా గరిష్ఠ చిల్లర ధరల (ఎంఆర్‌పీ) జాబితాలో కీలక క్యాన్సర్ మందుల ధరల్లో ఎలాంటి మార్పు కనిపించలేదు. 2026 నవంబర్ 9 నుంచి అమల్లోకి వచ్చే ఈ జాబితాలో కీమోథెరపీ, ఇమ్యునోథెరపీతో పాటు వివిధ రకాల క్యాన్సర్ల చికిత్సకు ఉపయోగించే పలు పేటెంట్ ఔషధాల ధరలు యథాతథంగా ఉన్నాయి. దీంతో ఖరీదైన మందులు కొనుగోలు చేసే రోగులు, వారి కుటుంబాలపై ఆర్థిక భారం కొనసాగనుంది.

లక్షల్లో క్యాన్సర్ మందుల ధరలు

తాజా ధరల జాబితా ప్రకారం పలు కీలక క్యాన్సర్ ఔషధాల గరిష్ఠ చిల్లర ధరల్లో మార్పు లేదు.

అలెసెన్సా : అలెక్టినిబ్ 150 మి.గ్రా. ధర రూ.4,30,696.

కీట్రూడా : పెంబ్రోలిజుమాబ్ 100 మి.గ్రా. ధర రూ.2,16,500.

టాగ్రిస్సో : ఒసిమెర్టినిబ్ 80 మి.గ్రా. ధర రూ.1,38,830.83.

ఫెస్గో : పెర్టుజుమాబ్, ట్రాస్టుజుమాబ్ కలయిక ఔషధం ధర రూ.4,93,266.

ఈ ఔషధాలు ఊపిరితిత్తులు, రొమ్ము, రక్తం తదితర క్యాన్సర్ల చికిత్సలో ఉపయోగపడతాయి. చికిత్సలో భాగంగా పలుమార్లు మందులు తీసుకోవాల్సి రావడంతో రోగులకు అయ్యే మొత్తం ఖర్చు మరింత పెరుగుతోంది. కొన్ని మందులు క్యాప్సూల్స్ రూపంలో ఉండగా, మరికొన్ని ఇంజెక్షన్ల రూపంలో అందుబాటులో ఉన్నాయి.

ట్రేడ్ మార్జిన్ నియంత్రణతోనూ ఉపశమనం ఏదీ?

నిర్దేశిత ధరల పరిధిలో లేని ఔషధాల (నాన్-షెడ్యూల్డ్ ఫార్ములేషన్స్) విక్రయాల్లో ట్రేడ్ మార్జిన్లను నియంత్రించినప్పటికీ, కీలక క్యాన్సర్ మందుల గరిష్ఠ చిల్లర ధరల్లో మార్పు రాలేదనే అంశం చర్చకు దారితీసింది. ఆసుపత్రులు రోగుల నుంచి వసూలు చేసే ధరలు, ఔషధాల అందుబాటు, చికిత్స వ్యయంపై మరింత దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని ఔషధాల అందుబాటుపై పనిచేస్తున్న నిపుణులు అభిప్రాయపడుతున్నారు.ఔషధాలు, చికిత్సలకు అందుబాటుపై పనిచేసే వర్కింగ్ గ్రూప్ సహ-కన్వీనర్ కె.ఎం. గోపకుమార్ ఈ అంశంపై ఏఎన్ఐతో మాట్లాడుతూ.. ట్రేడ్ మార్జిన్ నియంత్రణ ఒక్కటే మందులను అందుబాటు ధరల్లోకి తీసుకురావడానికి సరిపోదని పేర్కొన్నారు. ఆసుపత్రుల ద్వారా రోగులపై పడుతున్న ఆర్థిక భారాన్ని తగ్గించేందుకు మరిన్ని చర్యలు అవసరమని అభిప్రాయపడ్డారు.

పేటెంట్ మందులపై మరిన్ని చర్యలు అవసరం

దాదాపు 37 పేటెంట్ ఔషధాలకు చెందిన 65 ఫార్ములేషన్ల గరిష్ఠ చిల్లర ధరలు మారలేదని ఎన్‌పీపీఏ జాబితా సూచిస్తున్నట్లు గోపకుమార్ తెలిపారు. ప్రాణరక్షక ఔషధాలు అందుబాటు ధరల్లో లభించేలా పోటీని పెంచాలని, అవసరమైన సందర్భాల్లో తప్పనిసరి లైసెన్సింగ్ లేదా ప్రభుత్వ వినియోగం వంటి విధానాలను పరిశీలించాలని సూచించారు.

543 క్యాన్సర్ ఔషధ బ్రాండ్ల జాబితా

ఎన్‌పీపీఏ 543 క్యాన్సర్ ఔషధ బ్రాండ్లకు సంబంధించిన జాబితాను విడుదల చేసింది. అంతకుముందు అక్టోబర్ 17న నాన్-షెడ్యూల్డ్ ఔషధాల 137 సమ్మేళనాలపై ట్రేడ్ మార్జిన్‌ను 30 శాతానికి పరిమితం చేసే జాబితాను ప్రకటించింది. అయితే, తాజా ధరల వివరాల ప్రకారం పలు ఖరీదైన క్యాన్సర్ ఔషధాల ఎంఆర్‌పీల్లో మార్పు లేకపోవడంతో, రోగులకు వాస్తవంగా ఎంత మేరకు ఉపశమనం లభిస్తుందనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

కింగ్ మేకర్లే,కానీ...!? అరబ్ పార్లీల్లో సస్పెన్స్

జెరుసలేం ,ఇజ్రాయెల్ రాజకీయాల్లో కొత్త సమీకరణాలు తెరపైకి వస్తున్నాయి. ఎన్నికల్లో స్పష్టమైన మెజారిటీ ఏ కూటమికీ దక్కని పరిస్థితుల్లో అరబ్ పార్టీలు కీలక పాత్ర పోషించే అవకాశాలు కనిపిస్తున్నాయి. రికార్డు స్థాయిలో 19 స్థానాలు గెలుచుకునే దిశగా ఈ పార్టీలు సాగుతున్నప్పటికీ.. ప్రభుత్వ ఏర్పాటులో మాత్రం వాటికి భాగస్వామ్యం కల్పించేందుకు ప్రధాన రాజకీయ పక్షాలు వెనుకంజ వేస్తున్నాయి. ఈ వైఖరిపై బలాద్ పార్టీ నాయకుడు సామి అబు షహాదే తీవ్రంగా మండిపడ్డారు.ఇజ్రాయెల్ జనాభాలో దాదాపు ఐదో వంతు ఉన్న పాలస్తీనా పౌరులను రాజకీయంగా చెల్లుబాటు అయ్యే భాగస్వాములుగా గుర్తించడం లేదని ఆయన విమర్శించారు. ప్రజలు తమ నాయకత్వాన్ని ఎన్నుకున్నప్పటికీ.. ప్రధాన పార్టీలు కూటమి ఏర్పాటుకు నిరాకరించడం వివక్షేనని పేర్కొన్నారు."ఇది జాతి వివక్ష. మైనారిటీ ప్రజలకు ప్రాతినిధ్యం వహిస్తున్న చట్టబద్ధంగా ఎన్నికైన నాయకత్వం మాది. మా ప్రజల్లో అత్యధికులు మమ్మల్ని తమ నాయకత్వంగా ఎంచుకున్నారు" అని అబు షహాదే అల్ జజీరాతో అన్నారు.

మెజారిటీకి దూరంగా ప్రధాన కూటములు

ఇజ్రాయెల్ ఎన్నికల్లో 85 శాతం ఓట్ల లెక్కింపు పూర్తయ్యే సమయానికి.. ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహు నేతృత్వంలోని కూటమికి కనీసం 53 స్థానాలు, గాడి ఐసెన్‌కాట్ నేతృత్వంలోని ప్రతిపక్ష కూటమికి 48 స్థానాలు వస్తాయని కేంద్ర ఎన్నికల కమిటీ అంచనా వేసింది. ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన మెజారిటీ 61 స్థానాలు. దీంతో ఇరు కూటములకూ అదనపు మద్దతు అవసరమైంది.అరబ్ పార్టీలు కలిపి 19 స్థానాలు సాధించే దిశగా ఉండటంతో.. వాటి మద్దతు ప్రభుత్వ ఏర్పాటులో నిర్ణయాత్మకంగా మారే అవకాశం ఉంది. అయితే.. నెతన్యాహు ఇజ్రాయెల్ ప్రజలు బలమైన మితవాద ప్రభుత్వాన్ని కోరుకున్నారని చెబుతుండగా, ఐసెన్‌కాట్ మాత్రం మార్పు కోసం ప్రజలు ఓటేశారని పేర్కొంటున్నారు.ఈ పరిస్థితుల్లో అరబ్ పార్టీల మద్దతు తీసుకోవడంపై ప్రధాన పక్షాల వైఖరి కీలకంగా మారింది. గణితపరంగా ఐసెన్‌కాట్ కూటమి రెండు అరబ్ పార్టీలతో చేతులు కలిపితే మెజారిటీ సాధించే అవకాశం ఉన్నప్పటికీ.. అందుకు రాజకీయంగా అనేక అడ్డంకులున్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు.

కూటమికి దూరంగా ఎందుకు?

జాయింట్ లిస్ట్‌లోని మూడు పార్టీల్లో ఒకటైన బలాద్‌కు అబు షహాదే నాయకత్వం వహిస్తున్నారు. అయితే.. ఈ ఎన్నికల్లో ఆయన అభ్యర్థిగా పోటీ చేయలేదు. తీవ్రవాద భావజాలం కలిగిన భద్రతా మంత్రి ఇటమార్ బెన్ గ్విర్ అభ్యర్థన మేరకు ఎన్నికల కమిటీ ఆయనను అనర్హుడిగా ప్రకటించింది.2023 అక్టోబరు 7న హమాస్ దాడి జరిగిన మరుసటి రోజు అబు షహాదే రాసిన వ్యాసంలో ఆ ఘటనను "ముఖ్యమైన చారిత్రక సంఘటన"గా పేర్కొన్నారని బెన్ గ్విర్ ఆరోపించారు. దీనిపై అబు షహాదే సుప్రీంకోర్టును ఆశ్రయించారు. తాను సాయుధ పోరాటానికి మద్దతు ఇవ్వలేదని స్పష్టం చేశారు. వ్యాసంలోని ఒక పేరా తప్పుగా రాయబడిందని అంగీకరిస్తూనే.. తన ఉద్దేశం సంఘర్షణను రాజకీయ ప్రక్రియ వైపు మళ్లించడమేనని వివరించారు.మరోవైపు.. ఆక్రమిత వెస్ట్‌బ్యాంక్‌లోని రమల్లా నుంచి అల్ జజీరా ప్రతినిధి నూర్ ఓడెహ్ మాట్లాడుతూ.. పాలస్తీనా-ఇజ్రాయెల్ అరబ్ పార్టీలతో చర్చలు జరిపే విషయంలో నెతన్యాహు ప్రధాన రాజకీయ పక్షాలపై ఒత్తిడి తీసుకొచ్చారని విశ్లేషించారు. ఐసెన్‌కాట్, ఆయన మిత్రపక్షాలు జియోనిస్ట్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలనుకుంటున్నాయని, అరబ్ పార్టీలతో కలిసి ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి సిద్ధంగా లేవని ఆమె పేర్కొన్నారు. అమెరికాలో ఇజ్రాయెల్ రాయబారిగా పనిచేసిన డానీ అయలాన్ మాత్రం పాలస్తీనా పౌరుల నుంచి ఈసారి వచ్చిన ఓటింగ్ శాతం అపూర్వమని వ్యాఖ్యానించారు. అరబ్ పార్టీలు గణనీయమైన రాజకీయ ప్రభావాన్ని చూపగలవని అభిప్రాయపడ్డారు.జాయింట్ లిస్ట్ నాయకుడు యూసుఫ్ జబరీన్ కూడా నెతన్యాహును అధికారానికి దూరం చేయడానికి తమ కూటమి సిద్ధంగా ఉందని సంకేతాలిచ్చారు. తమ చేతులు సహకారం కోసం చాపి ఉన్నాయని ఆయన పేర్కొన్నారు.



స్వేచ్ఛ.. న్యాయం.. సమానత్వం కావాలి

తదుపరి ప్రభుత్వం నుంచి పాలస్తీనా పౌరులు ఆశిస్తున్న అంశాలను అబు షహాదే స్పష్టం చేశారు. గాజాలో మారణహోమానికి, వర్ణవివక్షకు తాము వ్యతిరేకమని తెలిపారు. జోర్డాన్ నది నుంచి మధ్యధరా సముద్రం వరకు ఉన్న ప్రాంతంలో నివసిస్తున్న ఇరువర్గాల ప్రజలకూ స్వేచ్ఛ, న్యాయం, సమానత్వం కల్పించే రాజకీయ ప్రత్యామ్నాయం అవసరమని అన్నారు.నెతన్యాహుపై విమర్శలు చేస్తూ.. "మా సమస్య ఏమిటంటే.. ఆయన యుద్ధ నేరస్థుడు" అని వ్యాఖ్యానించారు. గాజాలో గత అక్టోబరులో అమెరికా మధ్యవర్తిత్వంతో కాల్పుల విరమణ కుదిరిన తర్వాత కూడా ఇజ్రాయెల్ మారణహోమానికి పాల్పడుతోందని ఐక్యరాజ్యసమితి కమిషన్ సోమవారం విడుదల చేసిన నివేదికలో పేర్కొన్నట్లు కథనం తెలిపింది. ఈ ఆరోపణలపై ఇజ్రాయెల్ వైఖరిని ఈ కథనం వివరించలేదు.గాజా యుద్ధ సమయంలో జరిగిన యుద్ధ నేరాలకు సంబంధించి 2024లో అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు నెతన్యాహుపై అరెస్టు వారెంట్ జారీ చేసింది.

అరబ్ పార్టీలతో నయా సమీకరణాలు?

ప్రస్తుత ఎన్నికల ఫలితాలు ఇజ్రాయెల్‌లో ప్రభుత్వ ఏర్పాటును సంక్లిష్టంగా మార్చాయి. ఒకవైపు నెతన్యాహు కూటమి మితవాద ప్రభుత్వ ఏర్పాటుకు ప్రయత్నిస్తుండగా.. మరోవైపు ప్రతిపక్షం మార్పు నినాదంతో ముందుకు సాగుతోంది. ఈ రెండు కూటములకూ మెజారిటీకి అవసరమైన 61 స్థానాలు దక్కకపోవడంతో అరబ్ పార్టీల మద్దతు ప్రాధాన్యం సంతరించుకుంది.అయితే.. ఎన్నికల్లో ప్రజల నుంచి గణనీయమైన మద్దతు పొందిన అరబ్ పార్టీలను ప్రభుత్వం ఏర్పాటులో భాగస్వాములుగా అంగీకరిస్తారా? లేక వాటిని రాజకీయంగా పక్కనపెడతారా? అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. సంఖ్యాబలం ఒకవైపు.. రాజకీయ సిద్ధాంతాలు, కూటముల పరిమితులు మరోవైపు నిలవడంతో ఇజ్రాయెల్ తదుపరి ప్రభుత్వం ఏర్పాటుపై ఉత్కంఠ కొనసాగుతోంది.

అనకాపల్లి జెడ్పీ పీఠం...బీజేపీ వర్సెస్ జనసేన

విశాఖపట్టణం,అనకాపల్లి లో మొత్తం, 24 మండలాలు ఉన్నాయి. ఉమ్మడి విశాఖ నుంచి విడిపోయి తొలిసారి జిల్లా పరిషత్తుగా రూపు దిద్దుకుంది. ఈ జెడ్పీ పీఠం మీద తొలి చైర్మన్ ఎవరు కావాలి అన్నదే కూటమి పార్టీల మధ్య చర్చ సాగుతోంది. జడ్పీ పీఠాన్ని టీడీపీ అయితే మిత్రులకు వదిలేసి తాను విశాఖ జిల్లా జెడ్పీ పీఠాన్ని తీసుకుంటుందని చర్చ సాగుతోంది. దాంతో ఇక్కడ జనసేన వర్సెస్ బీజేపీల మధ్యనే ఈ పీఠం కోసం పోటీ సాగుతోంది అని అంటున్నారు. దానికి కారణం ఉంది. అనకాపల్లి ఎమ్మెల్యే జనసేనకు చెందిన మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ అయితే అనకాపల్లి ఎంపీగా బీజేపీకి చెందిన సీఎం రమేష్ ఉన్నారు. దాంతో ఆయన తన పట్టుని కొనసాగించడానికి జెడ్పీ పీఠం బీజేపీకి కావాలని కోరుతున్నారు. ఈ మేరకు ఆయన టీడీపీ పెద్దలతో మంతనాలు జరుపుతున్నారని అంటున్నారు. ఇక ఉత్తరాంధ్రాలో ఆరు జడ్పీ పీఠాలు ఉంటే రెండు తమకు కేటాయించాలని జనసేన కోరుతోంది. అందులో ఒకటి అల్లూరి జిల్లా అయితే రెండవది అనకాపల్లి కావాలని ఆ పార్టీ అడుగుతోంది. అలా కాకపోతే శ్రీకాకుళం అయినా ఇవ్వాలని అంటోంది. ఎందుకంటే విజయనగరం, విశాఖ జెడ్పీలతో పాటు పార్వతీపురం మన్యం జిల్లా జెడ్పీ టీడీపీ తీసుకుంది. శ్రీకాకుళం జనసేనకు ఇవ్వాలనుకున్నా మేయర్ సీటు ఇప్పటికే ఆ పార్టీకి ఇచ్చారు. జెడ్పీ కూడా అదే పార్టీకి ఇస్తే మొత్తం జిల్లా అంతా ఆ పార్టీకే ఇచ్చినట్లు అవుతుందని తమ్ముళ్ళు అభ్యంతరం చెబుతున్నారు. ఇక జనసేనకు కూడా తామకు ఇద్దరు ఎమ్మెల్యేలు ఉన్న అనకాపల్లి జిల్లాలోనే జెడ్పీ ఇస్తే బెటర్ అని కోరుకుంటోంది. దానికి టీడీపీ సుముఖంగ ఉంది అని వార్తలు వచ్చాయి. బీజేపీ కూడా అనకాపల్లి జిల్లాలో బలపడాలని చూస్తోంది. అయితే ఆ పార్టీకి జిల్లాలో ఎలమంచిలి మునిసిపాలిటీ చైర్మన్ పదవి ఇచ్చారు. ఇపుడు జెడ్పీ చైర్మన్ కూడా ఎలా ఇస్తారు అని అంటున్నారు. కానీ సీఎం రమేష్ ఎంపీగా తన రాజకీయ పరపతి ఉపయోగించి బీజేపీకి జెడ్పీ చైర్మన్ పీఠం తీసుకుని వస్తారని కమలనాధులు ఆశపడుతున్నారు. ఇక అనకాపల్లిలో చూస్తే కూటమిలో ఏ పార్టీ ఎన్నెన్ని జడ్పీటీసీలకి పోటీ చేస్తోంది అంటే టీడీపీ 15, జనసేన 5,

కాంగ్రెస్ ర్యాలీపై వర్తకుల ఆందోళన...

న్యూఢిల్లీ, కేంద్ర ఎన్నికల కమిషన్ చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ, సీఈసీ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని కోరుతూ ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో నవంబర్ 1న కాంగ్రెస్ నాయకత్వంలోని ప్రతిపక్ష ఇండియా కూటమి భారీ ర్యాలీకి ప్లాన్ చేసింది. అయితే, ఈ ర్యాలీని వాయిదా వేయాలని, పండగ సమయంలో తమ వ్యాపారాలు దెబ్బతింటాయని ఢిల్లీ వర్తకుల సంఘం కాంగ్రెస్ ఎంపీ, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీని కోరింది. పండుగల షాపింగ్ రద్దీ ఎక్కువగా ఉండే సమయంలో ఈ ర్యాలీ నిర్వహించడం వల్ల 21 ప్రధాన హోల్‌సేల్, రిటైల్ మార్కెట్లలో వ్యాపారాలు దెబ్బతిని రూ. 10,000 కోట్ల వరకు నష్టం వాటిల్లే అవకాశం ఉందని పేర్కొంది.ఈ ర్యాలీని దీపావళి ముగిసిన తర్వాత నవంబర్ 10 వరకు వాయిదా వేయాలని లేదా వాణిజ్య ప్రాంతాలకు దూరంగా వేరే ప్రాంతానికి మార్చాలని వర్తకుల సంఘం కాంగ్రెస్‌ను అభ్యర్థించింది. కాగా, ఈ ర్యాలీకి దాదాపు 10 లక్షల మంది హాజరయ్యే అవకాశం ఉందని కాంగ్రెస్ పేర్కొంది. రాహుల్ గాంధీకి రాసిన లేఖలో ఛాంబర్ ఆఫ్ ట్రేడ్ అండ్ ఇండస్ట్రీ చైర్మన్ బ్రజేష్ గోయల్ అక్టోబర్ 31, నవంబర్ 1 తేదీల్లో రోడ్ల దిగ్బంధం, ట్రాఫిక్ ఆంక్షల పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. పండుగ సీజన్‌లో కస్టమర్లు దుకాణాలకు రాలేరని వ్యాపారులు భయపడుతున్నారని ఆయన పేర్కొన్నారు.సీటీఐ ప్రకారం.. 10 లక్షల మంది తరలివస్తే ఢిల్లీలోకి 15,000 నుంచి 20,000 వరకు వాహనాలు వచ్చే అవకాశం ఉంది. వీటిలో 10,000 నుంచి 12,000 బస్సులు, 5,000 నుంచి 7,000 వరకు కార్లు, మినీ బస్సులు, టెంపో ట్రావెలర్లు ఉండొచ్చు. రామ్‌లీలా మైదానం పరిసర ప్రాంతాల్లో కనీసం 200 వాహనాలకు కూడా పార్కింగ్ సదుపాయం లేనప్పుడు ఈ వాహనాలన్నింటినీ ఎక్కడ పార్క్ చేస్తారని ఆ సంస్థ ప్రశ్నించింది. పాత ఢిల్లీలోని 10 నుంచి 12 అడుగుల వెడల్పు మాత్రమే ఉన్న ఇరుకైన వీధుల్లో ట్రాఫిక్ స్తంభించిపోతుందని ఆందోళన వ్యక్తం చేసింది. ఆ వీధుల్లో ఒక ట్రక్కు నిలిచిపోయినా గంటల తరబడి ట్రాఫిక్ జామ్‌లు ఏర్పడతాయని తెలిపింది.ర్యాలీ వల్ల తీవ్రంగా ప్రభావితమయ్యే 21 మార్కెట్లను అఐ గుర్తించింది. వీటిలో చాందినీ చౌక్, సదర్ బజార్, ఖారీ బావోలీ, భాగీరథ్ ప్యాలెస్, చాబ్రీ బజార్, కశ్మీరీ గేట్, కరోల్ బాగ్, దరియాగంజ్, పహార్‌గంజ్, జామా మసీదు, లాజ్‌పత్ రాయ్ మార్కెట్‌లు ఉన్నాయి. అక్టోబర్ 10న జంతర్ మంతర్ వద్ద జరిగిన కార్యక్రమాన్ని ప్రస్తావిస్తూ.. దాదాపు 4,000 మంది గుమిగూడటం వల్లే సెంట్రల్ ఢిల్లీలో రాకపోకలకు ఆటంకం ఏర్పడి వ్యాపారులకు రూ. 3,000 కోట్ల నష్టం వాటిల్లిందని తెలిపింది. ఇక నవంబర్ 1 నాటి ర్యాలీ వల్ల పాత ఢిల్లీలోని వాణిజ్య కార్యకలాపాలు పూర్తిగా స్తంభించిపోయి రూ. 10,000 కోట్ల వరకు నష్టం వచ్చే అవకాశం ఉందని అంచనా వేసింది.ర్యాలీని వాయిదా వేయడం సాధ్యం కాకపోతే ప్రత్యామ్నాయ వేదికలుగా బూరారీ గ్రౌండ్ లేదా జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలను ఎంపిక చేసుకోవాలని ప్రతిపాదించింది. పండుగ సీజన్‌లో వ్యాపారాలకు నష్టం వాటిల్లకుండా వర్తకుల ఆందోళనలను పరిగణనలోకి తీసుకోవాలని కాంగ్రెస్ నాయకత్వాన్ని అర్థించింది.ఢి

నాదెండ్ల మనోహర్ వైపే గురి..



గుంటూరు, ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో , ముఖ్యంగా డిజిటల్ స్పేస్‌లో ప్రస్తుతం తీవ్రమైన చర్చకు దారితీస్తున్న అంశం జనసేన పొలిటికల్ అఫైర్స్ కమిటీ ఛైర్మన్, రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్ లక్ష్యంగా సాగుతున్న సోషల్ మీడియా దాడులు. గతంలో ఎన్నడూ లేని విధంగా కొంతమంది జనసేన సానుభూతిపరులు, అభిమానులు , శ్రేణులు అని చెప్పుకునే నెటిజన్లు నేరుగా నాదెండ్ల మనోహర్‌ను టార్గెట్ చేస్తూ.. ఆయన పార్టీ బాధ్యతల నుంచి తప్పుకోవాలని, లేదా ఆయనను పక్కన పెట్టాలని పోస్టులు పెట్టడం రాజకీయ వర్గాల్లో కలకలం రేపుతోంది. గతంలో అనేక సందర్భాల్లో జనసేనాని పవన్ కళ్యాణ్ స్పందిస్తూ నాదెండ్ల మనోహర్‌ను ఏమైనా అంటే నన్ను అన్నట్లే, పార్టీ కష్టకాలంలో నిలబడిన శ్రేయోభిలాషి ఆయన అని బహిరంగ వేదికలపై స్పష్టమైన హామీ ఇచ్చినా కూడా.. ఈ ప్రచారం తగ్గకపోవడం వెనుక పెద్ద పొలిటికల్ స్కిట్ నడుస్తోందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.నిజానికి, 2019 ఘోర పరాజయం తర్వాత జనసేన ఉనికిని కాపాడుకోవడంలో, క్షేత్రస్థాయిలో పార్టీకి ఒక బలమైన ఆర్గనైజేషనల్ స్ట్రక్చర్ తీసుకురావడంలో నాదెండ్ల మనోహర్ పాత్రను ఎవరూ కాదనలేరు. మాజీ స్పీకర్‌గా ఆయనకున్న రాజకీయ అనుభవం, లీగల్ , అడ్మినిస్ట్రేటివ్ పరిజ్ఞానం పవన్ కళ్యాణ్‌కు ఎంతో ఉపకరించాయి. పార్టీ నాయకులు కార్యకర్తలను సమన్వయం చేయడం, పొత్తుల చర్చల సమయంలో టీడీపీ–బీజేపీ అగ్రనేతలతో సంప్రదింపులు జరపడం వంటి క్లిష్టమైన బాధ్యతలను నాదెండ్ల ఎంతో సైలెంట్‌గా నిర్వర్తించారు. అలాంటి వ్యూహకర్తను ఇప్పుడు ఉన్నపలంగా సొంత పార్టీకి చెందిన నెటిజన్లే నిందించడం వెనుక అసలు ఉద్దేశం ఏమిటనేది ప్రధాన ప్రశ్నగా మారింది.ఈ టార్గెటింగ్ వెనుక మొదటి ప్రధాన కారణం.. సీట్ల కేటాయింపులు , స్థానిక సంస్థల టికెట్ల అసంతృప్తి . కూటమి ప్రభుత్వంలో జనసేన 21 అసెంబ్లీ స్థానాల్లో 100% స్ట్రైక్ రేట్‌తో విజయం సాధించినప్పటికీ, స్థానిక ఎన్నికల్లో పొత్తుల కారణంగా అనేకమంది క్షేత్రస్థాయి నేతలకు, పోటీ చేయాలనుకున్న ఆశావహులకు సీట్లు దక్కలేదు. మున్సిపల్, పంచాయతీ, పరిషత్ ఎన్నికలలో కూడా సీట్ల కేటాయింపుల బాధ్యత నాదెండ్ల మనోహర్ నేతృత్వంలోని పిఏసి సమీక్షిస్తుండటంతో.. అవకాశాలు రాని ఆశావహులు తమ కోపాన్ని పవన్ కళ్యాణ్‌పై చూపించలేక, ఆయనకు కుడి భుజంగా ఉన్న నాదెండ్లపైకి మళ్లిస్తున్నారని విశ్లేషకులు భావిస్తున్నారు. పవన్ కళ్యాణ్‌ను కలవడానికి లేదా ఆయన వరకు తమ ప్రతిపాదనలు తీసుకెళ్లడానికి నాదెండ్ల మనోహర్ ఒక పెద్ద అడ్డంకిగా మారారని, ఆయన అనుమతి లేనిదే అధినేతను కలిసే అవకాశం దక్కడం లేదని ద్వితీయ శ్రేణి నేతలలో కొంత అసహనం ఉంది. రాజకీయాల్లో పార్టీ అధినేత చుట్టూ ఉండే రక్షణ కవచం వంటి నేతలే ఎప్పుడూ క్యాడర్ ఆగ్రహానికి మొదటి బాధితులవుతుంటారు. ఈ క్రమంలోనే పవన్ కంటే ముందు నాదెండ్ల విమర్శల దాడికి గురవుతున్నారు.విపక్ష వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ, ఇతర ప్రత్యర్థులు జనసేనను సంస్థాగతంగా బలహీనపరచడానికి డివైడ్ అండ్ రూల్ వ్యూహాన్ని అమలు చేస్తున్నాయనే కోణాన్ని తోసిపుచ్చలేం. నాదెండ్ల మనోహర్‌ను సామాజిక వర్గపరంగా, అలాగే రైట్ హ్యాండ్ స్థానం నుంచి వేరు చేయగలిగితే.. పవన్ కళ్యాణ్ చుట్టూ ఉన్న పరిపాలనా వ్యవస్థ, సమన్వయం దెబ్బతింటుందనేది ప్రత్యర్థుల ఆలోచన అయి ఉండవచ్చు. సోషల్ మీడియాలో దమ్మా ప్రొఫైల్స్ ద్వారా జనసేన కార్యకర్తల పేరిట నాదెండ్లపై నెగెటివ్ ప్రచారం చేయించడం ఈ మైండ్ గేమ్‌లో భాగమని భావిస్తున్నారు. అసలు నాదెండ్ల మనోహర్‌ను పార్టీకి దూరం చేస్తే లేదా ప్రాధాన్యత తగ్గిస్తే ఎవరికి లాభం.. ప్రథమంగా, ఇది జనసేనకు తీవ్రమైన నష్టాన్ని కలిగిస్తుంది. పవన్ కళ్యాణ్ పూర్తిస్థాయి డిప్యూటీ సీఎంగా నిరంతరం బిజీగా ఉండే సమయంలో పార్టీ రోజువారీ వ్యవహారాలు చూసే అనుభవజ్ఞుడైన అడ్మినిస్ట్రేటివ్ ఫేస్ కరువవుతుంది. రెండవది, కూటమి భాగస్వామ్య పక్షాలైన టీడీపీ, బీజేపీలతో సత్సంబంధాలు నెరపే సమన్వయకర్త తగ్గిపోతారు. ప్రత్యర్థులకు ఇది చాలా పెద్ద విజయం కాగా, జనసేనలోని కొన్ని అసంతృప్తి వర్గాలకు తాత్కాలిక సంతోషాన్ని ఇవ్వవచ్చు. సోషల్ మీడియా ట్రోలింగ్స్ , అసంతృప్తులు రాజకీయాల్లో సహజమే అయినప్పటికీ, నాదెండ్ల మనోహర్ లాంటి సీనియర్ నాయకుడి విషయంలో క్రమశిక్షణ తప్పడం పార్టీకి నష్టం కలిగిస్తుంది. పవన్ కళ్యాణ్ స్వయంగా రంగంలోకి దిగి తన స్పష్టమైన సందేశాన్ని మళ్లీ శ్రేణులకు అందిస్తే తప్ప, నాదెండ్లపై సాగుతున్న ఈ డిజిటల్ ప్రచారానికి తెరపడకపోవచ్చు

బ్యాలెట్ దిగింది ఎవరికి...మోడీ గెలిచారా ఓడారా ?

న్యూఢిల్లీ,బ్యాలెట్ విధానమే మళ్ళీ దేశంలో ప్రవేశపెట్టాలని విపక్షాలు గట్టిగా డిమాండ్ చేస్తున్నాయి. అది చాలా కాలంగా కోరుతున్నదే అయినప్పటికీ సర్ ప్రక్రియలో లోపాలు, ఈవీఎంల ట్యాంపరింగ్ అంటూ ఇటీవల కాలంలో విపక్షాల స్వరం మరింతగా పెంచాయి. రాబోయే అన్ని ఎన్నికల్లోనూ బ్యాలెట్ విధానం ఉండాలని ఏకైక డిమాండ్ తో విపక్షం అంతా ఒక్కటిగా కదులుతోంది. అయితే ఈ దేశంలో ఇంకా బ్యాలెట్ ద్వారా ఎన్నికలు జరుగుతున్నాయి. స్థానిక సంస్థలతో పాటు ఎమ్మెల్సీ ఎన్నికలకు బ్యాలెట్ విధానమే అమలులో ఉంది. ఈ ఎన్నికల్లో కూడా గెలుపోటములు వేరు వేరుగా ఉంటున్నాయి. అయితే తాజాగా దేశంలో వివిధ రాష్ట్రాలలో 28 ఎమ్మెల్సీ సీట్లకు పలు రాష్ట్రాలలో ఎన్నికలు జరిగాయి. అందులో 16 ఎమ్మెల్సీ సీట్లను ఎన్డీయే కూటమి గెలుచుకుంది. అదే సమయంలో బీజేపీకి హార్డ్ కోర్ సీట్లే కోల్పోవాల్సి వచ్చింది.

బీజేపీ గెలిచింది కానీ :

ఇక దేశంలోని నాలుగు రాష్ట్రాలైన ఉత్తర ప్రదేశ్, మహారాష్ట్ర, బీహార్, కర్ణాటక జరిగిన 28 ఎమ్మెల్సీ గ్రాడ్యుయేట్, టీచర్స్ స్థానాల ఎన్నికల్లో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే కూటమి ఏకంగా పదహారు సీట్లు గెలుచుకుంది. అయితే ఈ ఎన్నికల ఫలితాలు ఎన్డీయేకు ఒకవైపు విజయాన్ని అందించినప్పటికీ మరో వైపు ఇబ్బందికరమైన పరిస్థితిని కూడా తెచ్చాయని అంటున్నారు. బీజేపీ తన సంప్రదాయ అత్యంత ప్రతిష్టాత్మకమైన కొన్ని స్థానాలను కోల్పోవాల్సి వచ్చింది. అందులో మోడీ ఎంపీగా ప్రాతినిధ్యం వహిస్తున్న వారణాసిలోని ఎమ్మెల్సీ సీటు ఉంటే, బీజేపీకి ఆర్ఎస్ఎస్ కి పెట్టని కోటగా ఉన్న నాగపూర్ ఎమ్మెల్సీ సీటుని ఆ పార్టీ కోల్పోయింది.

భారీ షాక్ గానే :

ఈ రెండు సీట్లు ఎందుకు రాజకీయంగా ప్రాధాన్యత అంటే నాగపూర్ ఆర్ఎస్ఎస్ ప్రధాన కార్యాలయం ఉన్న నగరం. అంతేకాకుండా కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ, మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ వంటి అగ్రనేతలకు ఇది సొంత ఇలాకాగా ఉంది. ఇక చూస్తే దాదాపు ఐదు దశాబ్దాలుగా ఈ స్థానం బీజేపీ లేదా ఆ పార్టీ మద్దతు ఉన్న అభ్యర్థుల చేతిలోనే ఉంది. కానీ తాజాగా జరిగిన మహారాష్ట్ర ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల్లో మహా వికాస్ అఘాడీ మద్దతుతో కాంగ్రెస్ అభ్యర్థి విజయం సాధించి బీజేపీ కోటకు భారీ షాక్ ఇచ్చేశారు. అలాగే ఉత్తరప్రదేశ్ లోని వారణాసి ఎమ్మెల్సీ స్థానంలో ఎస్పీ అభ్యర్థి గెలిచారు. దశాబ్దాలుగా ఇక్కడ బీజేపీకి ఉన్న పట్టును ఎస్పీ అభ్యర్థి ఈ ఎన్నికల్లో గండి కొట్టేశారు.

మోడీ సమర్ధించుకున్నా :



అయితే బ్యాలెట్ పోరులోనూ తమదే విజయం అని మోడీ ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాల మీద కామెంట్స్ చేశారు. దేశంలోని నాలుగు పెద్ద రాష్ట్రాల్లో బ్యాలెట్ పేపర్ల ద్వారా జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఒక్క సీటు కూడా గెలవలేకపోవడాన్ని ఆయన ప్రస్తావించారు. ఈ ఎన్నికలు బ్యాలెట్ పేపర్లను ఉపయోగించి నిర్వహించారు. మరి కాంగ్రెస్ ఎన్ని సీట్లు గెలుచుకుందో అంటూ వ్యంగ్యంగా నరేంద్ర మోడీ ప్రశ్నించారు. సాధారణంగా ఎన్నికల్లో ఓడిపోయిన ప్రతిసారీ ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ ఈవీఎంలపై తప్పుపడుతూ బ్యాలెట్ పేపర్ల ద్వారానే ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేస్తుంటుంది. కాంగ్రెస్ చేసిన ఆరోపణలను మోడీ ఈ విధంగా తిప్పికొట్టారు. అయితే మహారాష్ట్రలో నాగపూర్ సీటుని కాంగ్రెస్ గెలుచుకుంది. అది బీజేపీ కంచుకోట అన్నది ఇప్పుడు కాంగ్రెస్ నేతలు గుర్తు చేస్తున్నారు. అలాగే వారణాసి ఫలితం కూడా షాక్ కాదా అంటున్నారు.

బ్యాలెట్ పెడతారా :

బీజేపీ ఎక్కువ సీట్లు గెలిచింది కాబట్టి ఇక మీదట సాధారణ ఎన్నికల్లోనూ బ్యాలెట్ పేపర్ ని పెడతారా అని విపక్షాలు ప్రశ్నిస్తున్నారు. బ్యాలెట్ పేపర్ పెడితే కచ్చితంగా బీజేపీ 2029 లో ఓడిపోతుందని ఆ పార్టీకి వంద ఎంపీ సీట్లు కూడా రావని తెలంగాణ పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. తాము ఎన్ని సీట్లు గెలిచామన్నది ప్రధానం కాదని ఆర్ఎస్ఎస్ బీజేపీ గుండెకాయ లాంటి నాగపూర్ సీటు కాంగ్రెస్ దక్కించుకోవడం ఎంతో విలువైనది అని ఆయన చెప్పుకొచ్చారు. బీజేపీ నైతికంగా ఓడిపోయింది అని ఆయన విమర్శిస్తున్నారు. ఇంతకీ మోడీ గెలిచారా లేక ఓడారా అంటే ఓడారు అని కాంగ్రెస్ బల్ల గుద్ది మరీ చెబుతోంది. నిజానికి బీజేపీలోనూ ఈ ఫలితాల మీద అంతర్మధనం జరుగుతోంది.

మహాపాదయాత్రపై బిగ్ ప్లాన్

హైదరాబాద్ ,తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలు, ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ పై చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని ఎండగట్టేందుకు బిజెపి భారీ వ్యూహంతో ముందుకు వచ్చింది. ప్రజాస్వామ్యాన్ని కాపాడండి.. అరాచకాన్ని అడ్డుకోండి అనే శక్తివంతమైన నినాదంతో నవంబర్ 2న ట్యాంక్‌బండ్ వేదికగా బిజెపి మహా పాదయాత్రను చేపట్టనుంది. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా స్వయంగా ఈ పాదయాత్రలో పాల్గొని తెలంగాణ రణక్షేత్రంలో బిజెపి శ్రేణులకు దిశానిర్దేశం చేయనుండటంతో రాష్ట్ర రాజకీయాల్లో ఒక్కసారిగా హడావుడి ప్రారంభమయింది.కాంగ్రెస్ ఓట్ చోరీ డ్రామాకు అమిత్ షా కౌంటర్ ఇచ్చేందుకు ఈ పాదయాత్ర చేపట్టారు. నవంబర్ 1న ఢిల్లీలోని రామ్‌లీలా మైదాన్‌లో కాంగ్రెస్ పార్టీ ఓట్ చోరీ ఆరోపణలతో నిర్వహించనున్న ర్యాలీకి సరిగ్గా మరుసటి రోజే హైదరాబాద్ వేదికగా అమిత్ షా ఈ పాదయాత్రలో పాల్గొనడం అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియపై రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ చేస్తున్న తప్పుడు ప్రచారాలను తిప్పికొట్టడమే ఈ పాదయాత్ర ముఖ్య ఉద్దేశం. మరణించినవారు, చిరునామాలు మారినవారి వివరాల సవరణను కాంగ్రెస్ రాజకీయం చేస్తోందని, ప్రజల్లోకి నేరుగా వెళ్లి నిజాలను వివరించేందుకు కేంద్ర హోంశాఖ మంత్రి స్వయంగా రంగానికి దిగుతున్నారు.ఈ మహా పాదయాత్ర కేవలం ఓటర్ల జాబితా వివాదానికే పరిమితం కాకుండా, రాష్ట్రంలో రోజురోజుకూ దిగజారుతున్న రేవంత్ రెడ్డి ప్రభుత్వ పాలనా వైఫల్యాలను నిలదీసేలా బిజెపి రూపకల్పన చేసింది. రాష్ట్రవ్యాప్తంగా 300కు పైగా మండలాల్లో తీవ్ర కరువు పరిస్థితులు నెలకొనడం, రాజధాని హైదరాబాద్‌లోనే రోజుకు వేలాది వాటర్ ట్యాంకర్ల కోసం ప్రజలు అల్లాడుతున్నా పట్టించుకోని రేవంత్ సర్కార్ తీరును బిజెపి ఎండగట్టనుంది.



ప్రజా సమస్యలను గాలికి వదిలేసి కాంగ్రెస్ నేతలు ఢిల్లీ పర్యటనలతో కాలక్షేపం చేస్తున్నారని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు ఘాటుగా విమర్శించారు.ట్యాంక్‌బండ్ నుంచి ప్రారంభమయ్యే ఈ పాదయాత్ర ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వానికి, సీఎం రేవంత్ రెడ్డికి బిజెపి గట్టి హెచ్చరికలు జారీ చేయనుంది. అమిత్ షా రాకతో బిజెపి శ్రేణుల్లో నూతనోత్సాహం వెల్లివిరిస్తుండగా,అధికార కాంగ్రెస్ దీనిపై ఎలా స్పందిస్తుందనేది ఆసక్తికరంగా మారింది.

బోరబండలో మెగా రక్తదాన శిబిరాలు

హైదరాబాద్,పంజాగుట్ట పోలీస్ స్టేషన్, జూబ్లీహిల్స్ పరిధిలోని బోరబండ లో నిర్వహించిన మెగా రక్తదాన శిబిరానికి ఖైరతాబాద్ జోన్ డీసీపీ శిల్పవల్లి, డిసిపి వెంకటరమణ హాజరయ్యారు. ఈ సందర్భంగా రక్తదాన కార్యక్రమంలో పాల్గొని రక్తదానం చేశారు.రక్తదానం ప్రాణదానంతో సమానమని, ఆపదలో ఉన్న వారికి రక్తదానం ఎంతో ఉపయోగపడుతుందని ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు

మల్లన్నసాగర్ నిర్వాసితులకు ఊరట



మెదక్, తెలంగాణ ప్రభుత్వం మల్లన్నసాగర్ నిర్వాసితులకు ఊరట కల్పించింది. మలన్నసాగర్ భూ నిర్వాసితులకు గజ్వేల్ – ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలో పునరావాసం కల్పించిన సంగతి తెలిసిందే. రాష్ట్ర ప్రభుత్వం నిర్వాసితులకు ఎల్ఆర్ఎస్ (లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీమ్ ఫీజు నుంచి మినహాయింపు కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. త్వరలోనే ఎల్ఆర్ఎస్ నుంచి మినహాయింపును అమలు చేస్తామని మున్సిపల్ కమిషనర్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తాజాగా తీసుకున్న నిర్ణయంతో మల్లన్నసాగర్ బాధితులకు ఊరట దక్కింది.సిద్ధిపేట జిల్లా పరిధిలో మల్లన్నసాగర్ నిర్మాణంతో తొగుట మండలంలోని ఆరు గ్రామాలు (లక్ష్మాపూర్, ఏటిగడ్డ కిష్టాపూర్, పల్లెపహాడ్, బంజేరుపల్లి, తండా, వేములఘాట్).. కొండపాక మండలంలోని రెండు గ్రామాలు (ఎర్రవల్లి, సింగారం) ముంపునకు గురయ్యాయి. ఈ ముంపు గ్రామాల నిర్వాసితుల కోసం గజ్వేల్ – ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని సంగాపూర్, లింగరాజుపల్లి మధ్య ఆర్‌అండ్‌ఆర్ కాలనీ నిర్మించిన సంగతి తెలిసిందే. గత మున్సిపల్ ఎన్నికల సందర్భంగా ఈ ముంపు గ్రామాలను గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలో ప్రభుత్వం విలీనం చేసింది.రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన ఈ కాలనీల్లో స్థలాలు పొందిన నిర్వాసితులు ఇళ్లు నిర్మించుకునే సమయంలో అనుమతి లేదని మున్సిపల్ అధికారులు అడ్డుకుంటున్నారు. కొత్త ఇంటి నిర్మాణం అగిపోవడంతో ఎల్ఆర్ఎస్ నుంచి పదేళ్లపాటు మినహాయింపు కల్పించాలని నిర్వాసితులు ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించి ఉత్తర్వులు జారీ చేయడంతో మల్లన్నసాగర్ నిర్వాసితులు ఆనందంలో ఉన్నారు.మరోవైపు మల్లన్నసాగర్ జలాశయం కట్టను ఆనుకొని భారీ పేలుళ్లు జరుగుతున్నాయన్నారు మాజీ మంత్రి హరీష్‌రావు. ఈ పేలుళ్లలతో కట్టకు ప్రమాదం జరిగితే బాధ్యత ఎవరిదని ప్రశ్నించారు. ఆయన మల్లన్నసాగర్ ఇన్‌టెక్ వెల్‌ను పరిశీలించారు. ఇంజినీర్లు అనుమతులు లేకుండా పనులు ఎందుకు చేపడుతున్నారని ప్రశ్నించారు. అక్కడ జిలెటెన్ స్టిక్స్ పెట్టి పేలుళ్లు ఎందుకు చేపడుతున్నారో చెప్పాలన్నారు. కిలోమీటరు దూరంలో తిప్పారంలో గోడలకు పగుళ్లు వస్తున్నాయన్నారు. మల్లన్నసాగర్‌పై కుట్రలు చేస్తున్నట్లు అనుమానం ఉందన్నారు. ఈ పేలుళ్లకు విచారణ జరిపి బాధ్యులైనవారిపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ అంశంపై హరీష్‌రావు నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి బహిరంగ లేఖ రాశారు

రాహుల్ మార్క్ మార్చ్...లక్షల మంది వస్తున్నారా ?



న్యూఢిల్లీ,ఇక మరో వైపు రామ్ లీలా మైదానం పరిసరాలలో దీపావళి పండుగ సందర్భంగా పది వేల కోట్ల దాకా వ్యాపారం జరుగుతుందని అంటున్నారు. తగ్గేది లేదంటూ రాహుల్ గాంధీ ముందుకు సాగుతున్నారు. నవంబర్ 1న రామ్ లీలా మైదానం దాకా మార్చ్ చేయాల్సిందే అని స్పష్టం చేస్తున్నారు. ఇది రాజకీయ యాత్ర కాదు దేశం యాత్ర అంటున్నారు. బీజేపీతో విసిగిన జనాలు అంతా ఢిల్లీకి రావాలని మార్చ్ లో పాల్గొనాలని రాహుల్ పిలుపు ఇచ్చారు. ఓట్ల చోరీ సాగుతోంది అని అందుకే రాజ్యాంగాన్ని రక్షించుకునేందుకే ఈ మార్చ్ అని రాహుల్ చెబుతున్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఢిల్లీలో మార్చ్ జరిగి తీరుతుందని ఆయన అంటున్నారు.

ప్రజాస్వామ్యం కోసం :

ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఈ యాత్ర అని ఆయన స్పష్టం చేస్తున్నారు. ఇది ఏ రాజకీయ పార్టీకి సంబంధించిన ర్యాలీ కాదని ఆయన అంటున్నారు. నరేంద్ర మోడీ అమిత్ షా విధాలతో విసిగిన ప్రజలందరికీ ఈ మార్చ్ లో పాల్గొనేందుకు ఆహ్వానం అని ఆయన చెబుతున్నారు. మాతో కలసి రండి పోరాడుదామని కోరుతున్నారు. లాఠీ దెబ్బలకు అసలు భయపడవద్దు అని సూచిస్తున్నారు. ఇది మీ సమస్య మన సమస్య మీ యాత్ర అని కూడా రాహుల్ స్పష్టం చేస్తున్నారు.

పది లక్షల మంది :

ఇదిలా ఉంటే ఢిల్లీలో నవంబర్ 1న జరప తలపెట్టిన మార్చ్ కి పది లక్షల మంది వస్తారని కాంగ్రెస్ సహా ఇండియా కూటమి అంచనా వేస్తోంది. ఇక రాహుల్ గాంధీ అయితే ఇది అత్యంత ప్రతిష్టగా తీసుకున్నారు. బీజేపీ మీద ఓట్ల చోరీ మీద కేంద్ర ఎన్నికల సంఘం మీద ఆయన జరుపుతున్న మలి విడత పోరాటంలో ఇది కీలకమైనదిగా చెబుతున్నారు. తొలి విడతగా అక్టోబర్ మొదటి వారంలో వరుసగా మూడు రోజుల పాటు ఆందోళనలు చేశారు. సుప్రీం కోర్టు దాకా ర్యాలీ తీశారు. ఈసారి రామ్ లీలా మైదానం దాకా ఈ మార్చ్ అని అంటున్నారు.

వద్దని చెప్పినా :

ఇక మరో వైపు రామ్ లీలా మైదానం పరిసరాలలో దీపావళి పండుగ సందర్భంగా పది వేల కోట్ల దాకా వ్యాపారం జరుగుతుందని అంటున్నారు. దాంతో ఈ పండుగ వేళలో ర్యాలీలు ఆందోళనలు వద్దు అని స్థానిక వ్యాపార వర్గాలు కాంగ్రెస్ ని కోరుతున్నాయి. అయితే రాహుల్ మాత్రం తగ్గేది లేదని అంటున్నారు. వ్యాపారుల సమస్యలను అర్థం చేసుకున్నామని కానీ అంతకంటే పెద్ద సమస్యగా ఓట్ల చోరీ అనంది ఉందని అన్నారు. ఇది పిల్లల భవిష్యత్తు దేశ భవిష్యత్తు అని చెబుతున్నారు.

రాజధానిలో లాక్ డౌన్ :

నిజానికి దేశ రాజధాని ఢిల్లీలో లాక్ డౌన్ ని కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తోంది అని ఆయన ఆరోపించారు. ఇప్పటికే మెట్రో రైళ్ళను మూసేసింది అని రోడ్లను అన్ని చోట్లా మూసేశారు అని ఆయన విమర్శించారు. ఇలాంటి పరిస్థితులు సాధారణం కావాలని అంటే సీఈసీ జ్ఞానేశ్ కుమార్ చేత కేంద్ర ప్రభుత్వం వెంటనే రాజీనామా చేయిస్తే చాలు తాము ఆందోళన విరమిస్తామని రాహుల్ స్పష్టం చేస్తున్నారు.

సక్సెస్ అవుతుందా :

అక్టోబర్ 10న జంతర్ మంతర్ వద్ద నిరసనలు అంటూ సీజేపీ ఇచ్చిన పిలుపుని విజయవంతంగా భగ్నం చేశారు. అయితే అది సీజేపీ ఉద్యమం. ఇపుడు కాంగ్రెస్ సహా అన్ని కీలక పార్టీలు మార్చ్ లో పాల్గొనబోతున్నాయి. మరి ఈ మార్చ్ ని ఏ విధంగా అడ్డుకుంటారు అన్నది చర్చ గా ఉంది. అయితే ఢిల్లీలోకి జనాలు ఇతర ప్రాంతాలకు రాకుండా కట్టుదిట్టమైన చర్యలను తీసుకుంటున్నారు. దాంతో పది లక్షల మందితో జరప తలపెట్టాలనుకున్న రాహుల్ మార్క్ మార్చ్ ఎంత మందితో సాగుతుంది అన్నది అంతా ఆసక్తిగా గమనిస్తున్నారు. రాహుల్ మాత్రం ప్రెస్టేజ్ గానే దీనిని తీసుకున్నారు అని అంటున్నారు.

స్థానిక ఎన్నికల వేళ టీడీపీలో అంతర్గత సెగ..

విజయవాడ,ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల ప్రచారం తుది దశకు చేరుకుంటున్న వేళ కూటమి పార్టీల్లో అంతర్గత విభేదాలు చర్చనీయాంశంగా మారుతున్నాయి. కొన్ని నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలకు, స్థానిక నాయకులకు మధ్య కొనసాగుతున్న అసంతృప్తి ఎన్నికలపై ప్రభావం చూపించే అవకాశం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. తమకు తగిన ప్రాధాన్యం ఇవ్వడం లేదని కొందరు నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తుండగా, ఎన్నికల సమయంలో సహకరించకపోవడం పార్టీ విజయావకాశాలను దెబ్బతీస్తుందని ఎమ్మెల్యే వర్గాలు భావిస్తున్నాయి. నవంబరు 1న జరగనున్న మున్సిపాలిటీ, కార్పొరేషన్ ఎన్నికల నేపథ్యంలో ఈ పరిణామాలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.తెలుగుదేశం పార్టీ లో కొన్ని ప్రాంతాల్లో స్థానిక నాయకులు, ఎమ్మెల్యేల మధ్య సమన్వయ లోపం స్పష్టంగా కనిపిస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఎమ్మెల్యేలు తమకు సంబంధించిన నాయకులకే ప్రాధాన్యం ఇస్తున్నారని, ఇతర వర్గాలను పట్టించుకోవడం లేదని అసంతృప్తితో ఉన్న నేతలు ఆరోపిస్తున్నట్లు సమాచారం. దీంతో అధికారిక అభ్యర్థులకు ప్రచారంలో అవసరమైన సహకారం అందడం లేదనే వాదనలు వినిపిస్తున్నాయి. మరోవైపు, ఎన్నికల సమయంలో అందరూ పార్టీ నిర్ణయానికి కట్టుబడి పనిచేయాలని ఎమ్మెల్యేలు తమ అనుచరులకు సూచిస్తున్నట్లు తెలుస్తోంది.ఆళ్లగడ్డ నియోజకవర్గంలో మాజీ మంత్రి భూమా అఖిలప్రియ కు, స్థానికంగా ఉన్న కొన్ని నాయకుల వర్గాలకు మధ్య విభేదాలు ఉన్నాయనే ప్రచారం రాజకీయంగా చర్చకు దారితీసింది. ఆమెకు సన్నిహితంగా ఉన్న నాయకులకు కొందరు స్థానిక నేతలు సహకరించడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కూటమి తరఫున పోటీ చేస్తున్న అభ్యర్థులకు కూడా కొన్ని వర్గాల నుంచి ఆశించిన స్థాయిలో మద్దతు లభించడం లేదనే చర్చ సాగుతోంది. అయితే ఈ పరిణామాలపై సంబంధిత నాయకుల అధికారిక స్పందనలు, పూర్తి వివరాలు వెలువడాల్సి ఉంది.మున్సిపల్ చైర్మన్, మేయర్ పదవులను ఆశించిన నాయకులకు అవకాశం దక్కకపోవడం కూడా అసంతృప్తికి కారణమవుతోంది. కొన్ని ప్రాంతాల్లో తెలుగుదేశం నాయకులు, వారి కుటుంబ సభ్యులు పదవులను ఆశించగా, పొత్తులో భాగంగా ఆ స్థానాలు జనసేన ,



భారతీయ జనతా పార్టీ అభ్యర్థులకు కేటాయించినట్లు తెలుస్తోంది. మరికొన్ని చోట్ల పార్టీ కోసం పనిచేసినప్పటికీ తమకు అవకాశం రాలేదని భావిస్తున్న నేతలు ప్రచారానికి దూరంగా ఉంటున్నారనే వార్తలు వస్తున్నాయి. పార్టీ అధిష్ఠానం నుంచి సూచనలు వచ్చినా, బుజ్జగింపు ప్రయత్నాలు సాగుతున్నా అసంతృప్తి పూర్తిగా తగ్గడం లేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.విజయవాడ, విజయనగరం , కర్నూలు, అనంతపురం, చిత్తూరు వంటి నగరాల్లో స్థానిక నాయకుల మధ్య సమన్వయం ఎన్నికల ఫలితాలకు కీలకంగా మారే అవకాశం ఉంది. అభ్యర్థులకు క్షేత్రస్థాయిలో కార్యకర్తల మద్దతు లభించకపోతే ప్రచార ప్రభావం తగ్గే ప్రమాదం ఉంది. ఈ నేపథ్యంలో టీడీపీ నాయకత్వం పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, విభేదాలను పరిష్కరించేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. అసంతృప్త నేతలకు నామినేటెడ్ పదవులు కల్పించడం ద్వారా వారిని పార్టీ కార్యకలాపాల్లో మరుగ్గా భాగస్వాములను చేసే ఆలోచన కూడా చర్చలో ఉంది.చివరి దశ ప్రచారంలో అసంతృప్తులను ఎంతవరకు సమన్వయం చేయగలరన్నది ఇప్పుడు కీలకంగా మారింది. వ్యక్తిగత విభేదాలను పక్కనపెట్టి కూటమి అభ్యర్థుల విజయానికి నాయకులు కలిసి పనిచేస్తారా? లేక అంతర్గత పోరు ఎన్నికల ఫలితాలపై ప్రభావం చూపుతుందా? అన్నది నవంబరు 1న జరిగే ఎన్నికలతో స్పష్టమయ్యే అవకాశం ఉంది.

Edited, Printed, Published & owned by KOTAGIRI CHANDRA SHEKAR, Published From, H.NO.5-7-163 PRAKASHAM BAZAR, NALGONDA TOWN, TELANGANA- 508 001, Printed at KOTAGIRI GRAPHICS & KOTAGIRI OFFSET PRINTER, H.NO.5-7-163 PRAKASHAM